RNI No: TGTEL/25/A2649

VOICE OF PRAJALU

వాయిస్ ఆఫ్ ప్రజలు

ప్రజల గొంతుక - నిజం కోసం..

HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMABAD ADILABAD

హైదరాబాద్ | సోమవారం, నవంబరు 2, 2026 | తెలుగు దినపత్రిక | సంపుటి:1 | సంచిక : 174 | పేజీలు: 8 | వెల : రూ.1



NHM ఉద్యోగుల సమస్యలు

పరిష్కరించాలి

::: డా.గడల శ్రీనివాసరావు

నీటి సంరక్షణకు 'గ్రీన్ ట్యాంకర్' కీలక ముందడుగు

హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్బీ 37వ ఆవిర్భావ దినోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి సందేశం

నిర్మాణ, పారిశ్రామిక అవసరాలకు శుద్ధి చేసిన మురుగునీటిని వినియోగించాలి

ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో మంచినీటి వనరుల పరిరక్షణకు పిలుపు



హైదరాబాద్, నవంబరు 2 (వాయిస్ టుడే): హైదరాబాద్ నగరం వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని నీటి భద్రతకు, జలవనరుల సుస్థిర నిర్వహణకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి సూచించారు. హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు (హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్బీ) 37వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బోర్డు అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది, వారి కుటుంబ సభ్యులకు ఆయన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. గత 37 సంవత్సరాలుగా హైదరాబాద్ ప్రజలకు సురక్షితమైన తాగునీటిని అందించడంతో పాటు మురుగునీటి నిర్వహణలో బోర్డు కీలక పాత్ర పోషించిందని సీఎం అభినందించారు. నగర అభివృద్ధి, ప్రజారోగ్యం, సమగ్ర ప్రగతికి హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్బీ అందించిన సేవలు ప్రశంసనీయమని పేర్కొన్నారు.

మంచినీటి వినియోగాన్ని తగ్గించాలి

హైదరాబాద్ నగరం నిరంతరం విస్తరిస్తున్న నేపథ్యంలో ఎల్‌నినో ప్రభావం, రానున్న వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని మంచినీటి వనరులను పరిరక్షించేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలని సీఎం సూచించారు. గృహావసరాలకు సంబంధం లేని ఇతర అవసరాల కోసం మంచినీటి వినియోగాన్ని తగ్గించాలని స్పష్టం చేశారు.

'డయల్ గ్రీన్ ట్యాంకర్' ప్రారంభం

'డయల్ గ్రీన్ ట్యాంకర్ -- గ్రీన్ ట్యాంకర్ ఆపరేషన్స్' కార్యక్రమాన్ని ప్రారంభించడాన్ని ముఖ్యమంత్రి అభినందించారు. సుస్థిర నీటి నిర్వహణ దిశగా సరైన సమయంలో చేపట్టిన కీలక కార్యక్రమంగా దీనిని అభివర్ణించారు. ఈ కార్యక్రమం ద్వారా శుద్ధి చేసిన మురుగునీటిని ప్రత్యామ్నాయ అవసరాలకు వినియోగించడంపై అవగాహన, ఆచరణ పెరుగుతాయని పేర్కొన్నారు.

నిర్మాణాలు, పరిశ్రమలకు శుద్ధి చేసిన నీరు

ప్రభుత్వ శాఖలు, పరిశ్రమలు, నిర్మాణ సంస్థలు, వాణిజ్య సంస్థలు తమ తోటల పెంపకం, నిర్మాణ పనులు, పారిశ్రామిక అవసరాల కోసం శుద్ధి చేసిన మురుగునీటిని విస్తృతంగా వినియోగించాలని సీఎం కోరారు. దీనివల్ల మంచినీటిపై ఆధారపడటం తగ్గడంతో పాటు గృహావసరాలకు అవసరమైన తాగునీటిని అందుబాటులో ఉంచేందుకు వీలవుతుందని వివరించారు.

నీటి సంరక్షణ అందరి బాధ్యత

నీటి సంరక్షణను సమష్టి బాధ్యతగా స్వీకరించాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. సుస్థిరమైన, నీటి భద్రత కలిగిన హైదరాబాద్ నిర్మాణంలో ప్రజలు, ప్రభుత్వ శాఖలు, పారిశ్రామిక సంస్థలు భాగస్వాములు కావాలని సూచించారు. కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్) పరిధిలోని ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్బీ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.



అమిత్ షా నేతృత్వంలో రేపు హైదరాబాద్‌లో భారీ పాదయాత్ర

ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించిన బీజేపీ నేతలు

హైదరాబాద్: ప్రజాస్వామ్య, రాజ్యాంగ వ్యవస్థల పరిరక్షణ నినాదంతో రేపు మధ్యాహ్నం 3 గంటలకు హైదరాబాద్‌లో భారీ పాదయాత్ర నిర్వహించనున్నారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా నేతృత్వంలో బషీర్‌బాగ్‌లోని డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం నుంచి ఎం.జె. మార్కెట్ వరకు ఈ పాదయాత్ర కొనసాగనుంది. పాదయాత్ర ఏర్పాట్లలో భాగంగా బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు నరపరాజు రాంచందర్ రావుతో కలిసి పార్టీ నేతలు పాదయాత్ర మార్గాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలను కలుసుకుని ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ వ్యవస్థలను కాపాడుకోవాల్సిన అవసరాన్ని వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ తెలంగాణ ఇన్‌ఛార్జ్ అభయ్ పాటిల్‌తో పాటు పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఓటు చోరీకి వ్యతిరేకంగా ఢిల్లీలో కాంగ్రెస్ సమరభేరి

'ఓట్ బచావో.. దేశ్ బచావో' ర్యాలీకి తెలంగాణ నుంచి వేలాదిగా తరలివెళ్లిన కాంగ్రెస్ శ్రేణులు

ప్రయాణాన్ని అడ్డుకునే ఢ ప్రయత్నాలు చేసినా వెనక్కి తగ్గని కార్యకర్తలు

ప్రజాస్వామ్యం, రాజ్యాంగ పరిరక్షణే లక్ష్యంగా పోరాటం: సీఎం రేవంత్ రెడ్డి

న్యూఢిల్లీ, నవంబర్ 2 (వాయిస్ టుడే): దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణ, ఓటు హక్కు కాపాడటమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన 'ఓట్ బచావో.. దేశ్ బచావో' ర్యాలీకి తెలంగాణ నుంచి పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. ఢిల్లీలోని చారిత్రాత్మక రామ్‌లీలా మైదానంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో తెలంగాణ కాంగ్రెస్ శ్రేణులు ఉత్సాహంగా పాల్గొన్నాయి. ఈ సందర్భంగా తెలంగాణ నుంచి ఢిల్లీకి చేరుకున్న వేలాది మంది కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ శ్రేణులు ఢిల్లీకి చేరుకోకుండా వారి ప్రయాణాన్ని అడ్డుకునేందుకు ప్రయత్నాలు జరిగినప్పటికీ కార్యకర్తల సంకల్పం ఏమాత్రం తగ్గలేదని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఇంతటి సంఖ్యలో ఢిల్లీకి తరలిరావడం తెలంగాణ కాంగ్రెస్ పోరాట స్ఫూర్తికి నిదర్శనమని అభిప్రాయపడ్డారు.

ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి పునాది

భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి ప్రాణాధారమని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అందించిన రాజ్యాంగ విలువలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందన్నారు. ఓటు హక్కును బలహీనపరిచే లేదా ఎన్నికల ప్రక్రియపై ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీసే ప్రయత్నాలను ఐక్యంగా ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు.

ఓటు చోరీపై దేశవ్యాప్త చర్చ

ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, ఓటర్ల జాబితాల ప్రామాణికత, ప్రతి అర్హుడికి ఓటు హక్కు భద్రత వంటి అంశాలను కాంగ్రెస్ పార్టీ ఈ ర్యాలీ ద్వారా జాతీయ స్థాయిలో ప్రస్తావించింది. ఓటు చోరీ జరుగుతోందంటూ కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణలపై ప్రజల్లో అవగాహన కల్పించడం, ప్రజాస్వామ్య సంస్థల స్వతంత్రతను పరిరక్షించాలనే డిమాండ్‌ను బలంగా వినిపించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశంగా నిలిచింది.

వానరసేన స్ఫూర్తితో పోరాటం

రామాయణంలో రావణుడిపై పోరాటంలో శ్రీరాముడికి వానరసేన అండగా నిలిచినట్లుగా, ఓటు చోరీకి, ప్రజాస్వామ్య వ్యవస్థలను బలహీనపరిచే శక్తులకు వ్యతిరేకంగా కాంగ్రెస్ కుటుంబం ఐక్యంగా పోరాడుతుందని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ పోరాటంలో విజయం సాధించే వరకు విశ్రమించబోమని స్పష్టం చేశారు. తెలంగాణ నుంచి ఢిల్లీకి తరలివచ్చిన ప్రతి కాంగ్రెస్ కార్యకర్త ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమంలో భాగస్వామిగా నిలిచారని ఆయన అభినందించారు. పార్టీ నాయకత్వం ఇచ్చిన పిలుపునకు స్పందించి ప్రయాణ కష్టాలను అధిగమించి ర్యాలీలో పాల్గొన్న కార్యకర్తల అంకితభావాన్ని ప్రశంసించారు.

ప్రజాస్వామ్య పరిరక్షణకు పిలుపు

ప్రతి ఓటును కాపాడుకోవాలని, రాజ్యాంగాన్ని పరిరక్షించాలని, ప్రజాస్వామ్య వ్యవస్థలను బలోపేతం చేయాలని రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. ఓటు హక్కు విషయంలో ప్రతి పౌరుడు అప్రమత్తంగా ఉండాలని, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం ఐక్యంగా నిలవాలని పేర్కొన్నారు. తెలంగాణ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల భాగస్వామ్యంతో ఢిల్లీలో జరిగిన ఈ ర్యాలీ రాష్ట్ర కాంగ్రెస్ రాజకీయ కార్యాచరణలోనూ ప్రాధాన్యత సంతరించుకుంది

రాప్తాడు ఘటనలో గాయపడిన బాలికకు మెరుగైన వైద్యం అందించాలి

బెంగళూరులోని మణిపాల్ ఆసుపత్రికి వెళ్లి వైద్య చికిత్సను పర్యవేక్షించిన ముఖ్యమంత్రి

బాలిక తల్లిదండ్రులకు ప్రభుత్వ అండగా ఉంటుందని భరోసా

బెంగళూరు: రాప్తాడు ఘటనలో తీవ్రంగా గాయపడిన బాలికకు అందుతున్న వైద్య చికిత్సను పర్యవేక్షించేందుకు బెంగళూరులోని మణిపాల్ ఆసుపత్రిని సందర్శించాను. బాలికకు వైద్యులు అవసరమైన శస్త్రచికిత్సలను విజయవంతంగా పూర్తి చేశారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నప్పటికీ, రానున్న 48 గంటలు అత్యంత కీలకమని వైద్యులు తెలిపారు. బాలిక ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నాం. బాలిక తల్లిదండ్రులను పరామర్శించి, ప్రభుత్వం మరియు వ్యక్తిగతంగా తాను అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చాను. ఈ దారుణ ఘటనకు పాల్పడిన నిందితుడికి చట్టప్రకారం అత్యంత కఠినమైన శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశాను. బాలిక త్వరగా పూర్తిస్థాయిలో కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నాను.



ఈసారి మాపై దాడి చేస్తే, ప్రపంచంలో ఎక్కడైనా ప్రతిదాడి చేస్తాం: మొజ్తబా ఖమేనీ తీవ్ర హెచ్చరిక

అమెరికా, ఇజ్రాయెల్ దాడులపై ఇరాన్ స్పందన

భౌగోళిక పరిమితులు లేకుండా బదులిస్తామన్న సుప్రీం లీడర్ ఖొమైనీ

సర్వసన్నద్ధంగా ఉండాలని సైనిక దళాలకు ఆదేశాలు

ఒకవైపు దౌత్య చర్చలు, మరోవైపు యుద్ధ హెచ్చరికలతో ఉద్రిక్తత

ఇరాన్ అణు కేంద్రాలపై దాడి చేయగలమన్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్





కాంగ్రెస్ రాజ్యాంగ పరిరక్షణ పేరుతో విచిత్ర నాటకం ఆడుతోంది

ఓటర్ల జాబితా ప్రక్షాళనపై దుష్ప్రచారం తగదు: ఎంపీ ఈటల రాజేందర్

అమిత్ షా మహా పాదయాత్రను విజయవంతం చేయాలి

డంపింగ్ యార్డు తరలించే వరకు పోరాటం ఆగదు

ఫాక్స్ సాగర్ వద్ద దేవాలయాల కూల్చివేతలపై ప్రభుత్వానికి ప్రశ్నలు

వాయిస్ ఆఫ్ ప్రజలు

సోమవారం, నవంబరు 2, 2026

NHM ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి: డా.గడల శ్రీనివాసరావు

ఉద్యోగుల సమ్మెకు జనసేన సంఘీభావం..
అవసరమైతే ఆమరణ నిరాహార దీక్షకు సిద్ధం



మిరియాల రామకృష్ణ, ఉమ్మడి ఖమ్మం జిల్లా పార్టీ నాయకులు, కార్యకర్తలు, జనసైనికులు, వీర మహిళలు పాల్గొని చీనవీ ఉద్యోగులకు సంఘీభావం తెలిపారు.

కొత్తగూడెం (వాయిస్ టుడే): తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం కొత్తగూడెం కలెక్టరేట్ వద్ద గత ఐదు రోజులుగా సమ్మె చేస్తున్న జాతీయ ఆరోగ్య మిషన్ (చీనవీ) ఉద్యోగులకు జనసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, వరంగల్--ఖమ్మం--నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి డా. గడల శ్రీనివాసరావు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దాదాపు 20 ఏళ్లుగా చీనవీ ఉద్యోగులతో కలిసి పనిచేసిన అనుభవం తనకు ఉందని, వారి సమస్యలు, కష్టాలను దగ్గరగా చూశానని పేర్కొన్నారు. ప్రజారోగ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్న ఉద్యోగులు తమ హక్కుల కోసం సమ్మెకు దిగాల్సిన పరిస్థితి రావడం బాధాకరమన్నారు. NHM ఉద్యోగుల సేవలను ప్రభుత్వం గుర్తించి, వారి న్యాయమైన డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని కోరారు. ప్రజారోగ్యానికి సేవలందిస్తున్న ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు న్యాయం జరిగే వరకు జనసేన పార్టీ అండగా ఉంటుందని, అవసరమైతే వారితో కలిసి ప్రత్యక్ష పోరాటానికి సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. పరిస్థితులు అవసరమైతే చీనవీ ఉద్యోగుల న్యాయం కోసం ఆమరణ నిరాహార దీక్షకు సైతం వెనుకాడబోనని ప్రకటించారు. ప్రభుత్వం ఇకనైనా స్పందించి ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి

NHM ఉద్యోగుల సమ్మెకు ఎంపీ వద్దిరాజు సంపూర్ణ మద్దతు

20 రోజులుగా ఆందోళన చేస్తున్నా
ప్రభుత్వం స్పందించడం లేదు
న్యాయమైన డిమాండ్లు పరిష్కరించకుంటే
కేంద్ర ఆరోగ్య మంత్రిని కలుస్తా: ఎంపీ రవిచంద్ర



కొత్తగూడెం (వాయిస్ టుడే): తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం సమ్మె చేస్తున్న జాతీయ ఆరోగ్య మిషన్ (NHM) ఉద్యోగులకు బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నాయకుడు, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర సంపూర్ణ మద్దతు ప్రకటించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్ వద్ద ఏర్పాటు చేసిన ఉద్యోగుల ఆందోళన శిబిరాన్ని ఆదివారం సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం క్షేత్రస్థాయిలో సేవలందిస్తున్న వైద్యులు, ఏఎన్ఎంలు, నర్సులు 20 రోజులుగా సమ్మె చేస్తున్నా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ స్పందించకపోవడం విచారకరమన్నారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ విధానాల్లో ఏళ్ల తరబడి పనిచేస్తున్న తమ సేవలను క్రమబద్ధీకరించాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని తదితర డిమాండ్లతో ఈ నెల 13వ తేదీ నుంచి చీనవీ ఉద్యోగులు ఆందోళన చేస్తున్నారని తెలిపారు.

మహిళా ఉద్యోగుల డిమాండ్లు న్యాయబద్ధమైనవే

NHM ఉద్యోగుల్లో అధిక శాతం మహిళలే ఉన్నారని, రెగ్యులర్ ఉద్యోగుల మాదిరిగానే జీతంతో కూడిన ఎనిమిది నెలల ప్రసూతి సెలవులు కోరడం న్యాయబద్ధమైన డిమాండ్ అని రవిచంద్ర పేర్కొన్నారు. మంగళవారం ఖమ్మంలో ఉద్యోగులు తనను కలిసి వినతిపత్రం అందజేయగా, వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు ఫోన్ చేసి వారి సమస్యలను పరిష్కరించాలని కోరినట్లు వెల్లడించారు. జాతీయ ఆరోగ్య మిషన్‌లో కేంద్ర ప్రభుత్వ వాటా 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వ వాటా 40 శాతంగా ఉందని పేర్కొంటూ, ఉద్యోగులకు ఆరోగ్య బీమా కల్పించకపోవడం, ఈహెచ్ఎస్ కార్డులు మంజూరు చేయకపోవడం బాధాకరమన్నారు. కేంద్ర ప్రభుత్వం అందించే ఇంక్రిమెంట్లు, ఎనిమిది శాతం లాయల్టీ బోనస్ వంటి ప్రయోజనాలను కూడా రాష్ట్ర ప్రభుత్వం చెల్లించడం లేదని ఆరోపించారు.

కరోనా సమయంలో ప్రాణాలు కాపాడిన ఉద్యోగులు

కరోనా మహమ్మారి విజృంభించిన సమయంలో NHM ఉద్యోగులు విశేష సేవలందించి ఎంతోమంది ప్రాణాలను కాపాడారని ఎంపీ గుర్తుచేశారు. అలాంటి ఉద్యోగులకు ఆరోగ్య బీమా, వైద్య భద్రత కల్పించకపోవడం సమంజసం కాదన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తానని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించినప్పటికీ, మహిళా ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం కాకపోవడమే ప్రభుత్వ వైఖరికి నిదర్శనమని విమర్శించారు. మహిళల ఓట్లు అడిగే ముందు వారి సమస్యలను పరిష్కరించాలని వ్యాఖ్యానించారు.

కేంద్ర ఆరోగ్య మంత్రిని కలుస్తా

కాంగ్రెస్, బీజేపీ రెండూ ఢిల్లీ కేంద్రంగా పనిచేసే పార్టీలని, తెలంగాణ ప్రయోజనాల విషయంలో స్థానిక సమస్యలకు ప్రాధాన్యత ఇవ్వాలని రవిచంద్ర అన్నారు. పంతాలు, పట్టింపులకు పోకుండా మానవీయ కోణంలో స్పందించి చీనవీ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి దామోదర రాజనర్సింహను కోరారు. ప్రభుత్వం స్పందించని పక్షంలో బీఆర్ఎస్ నాయకులు కేటీఆర్, హరీశ్‌రావులతో చర్చించి వారి సూచనల మేరకు కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జె.పీ. నడ్డాను కలిసి చీనవీ ఉద్యోగుల సమస్యలను వివరించి పరిష్కారానికి కృషి చేస్తానని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర హామీ ఇచ్చారు.



ఢిల్లీలో 'ఓట్ బచావో.. దేశ్ బచావో' మహా ర్యాలీ

రాంలీలా మైదానంలో పాల్గొన్న టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్

న్యూఢిల్లీ: 'ఓట్ బచావో.. దేశ్ బచావో' కార్యక్రమంలో భాగంగా ఢిల్లీలోని రాంలీలా మైదానంలో నిర్వహించిన మహా ర్యాలీలో టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ పాల్గొన్నారు. ఆయనతో పాటు తెలంగాణకు చెందిన ప్రజాప్రతినిధులు, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ నాయకులు ర్యాలీలో పాల్గొన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ, ఓటు హక్కు ప్రాధాన్యతపై నిర్వహించిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా 'ఛలో ఢిల్లీ' నినాదంతో తెలంగాణ కాంగ్రెస్ శ్రేణులు ర్యాలీలో భాగస్వాములయ్యాయి.

ఈసారి మాపై దాడి చేస్తే, ప్రపంచంలో ఎక్కడైనా ప్రతిదాడి చేస్తాం: మొజ్తబా ఖమేనీ తీవ్ర హెచ్చరిక

అమెరికా, ఇజ్రాయెల్ దాడులపై ఇరాన్ స్పందన

భౌగోళిక పరిమితులు లేకుండా బదులిస్తామన్న సుప్రీం లీడర్ ఖొమైనీ

సర్వసన్నద్ధంగా ఉండాలని సైనిక దళాలకు ఆదేశాలు

ఒకవైపు దౌత్య చర్చలు, మరోవైపు యుద్ధ హెచ్చరికలతో ఉద్రిక్తత

ఇరాన్ అణు కేంద్రాలపై దాడి చేయగలమన్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్



అంతర్జాతీయ ఉద్రిక్తతల నడుమ ఇరాన్ సంచలన హెచ్చరికలు జారీ చేసింది. తమ దేశంపై అమెరికా లేదా ఇజ్రాయెల్ మళ్లీ దాడికి పాల్పడితే, ఎలాంటి భౌగోళిక పరిమితులు లేకుండా తక్షణమే, శక్తిమంతంగా బదులిస్తామని స్పష్టం చేసింది. ప్రపంచంలో ఎక్కడైనా దాడి చేస్తామని హెచ్చరించింది. ఈ మేరకు సర్వసన్నద్ధంగా ఉండాలని ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ దేశ సాయుధ దళాలను ఆదేశించారు. ప్రస్తుత వివాదం మొదలైన తర్వాత తొలిసారిగా దేశంలోని ముగ్గురు ఉన్నత సైనిక కమాండర్లతో మొజ్తబా ఖమేనీ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన కీలక ఆదేశాలు జారీ చేశారు. "శత్రువులు మళ్లీ సైనిక లేదా ఉగ్రవాద దాడులకు దిగితే, ఆ ఘర్షణలు ఎప్పుడు, ఎలాంటి పరిస్థితుల్లో ముగుస్తాయో ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్ సైన్యం, ఇరాన్ ప్రజలే నిర్ణయిస్తారు" అని మొజ్తబా స్పష్టం చేసినట్లు ఆయన కార్యాలయం వెల్లడించింది. "శత్రు దేశాల భౌతిక, అభౌతిక ఆస్తులన్నింటినీ లక్ష్యం చేసుకునేలా టార్గెట్ డేటాబేస్‌ను నవీకరించాలని సూచించారు. ఈ సమావేశంలో సైనిక కమాండర్లు కూడా తమ సంసిద్ధతను ఖమేనీకి వివరించారు. పర్షియన్ గల్ఫ్ తీరం, హర్మూజ్ జలసంధి, ఒమన్ గల్ఫ్ సహా దేశ సరిహద్దుల వద్ద గరిష్ఠ స్థాయిలో అప్రమత్తంగా ఉన్నామని తెలిపారు. ఆయుధాలు, నిఘా పరికరాలు, మందుగుండు సామగ్రి ఉత్పత్తిని గణనీయంగా పెంచినట్లు నివేదించారు. సైనిక నిఘాను బలోపేతం చేయడం, స్వదేశీ రక్షణ సామర్థ్యాలను విస్తరించడంపై దృష్టి సారించినట్లు పేర్కొన్నారు. మరోవైపు, ఇరాన్ ఉన్నత భద్రతా అధికారి మొహసెన్ రెజాయ్ మాట్లాడుతూ.. తమపై దాడి జరిగితే విధ్వంసకరంగా దెబ్బతీస్తామని, కొత్త ఆయుధాలను ఉపయోగిస్తామని హెచ్చరించారు. అయితే, అమెరికా తమ ఏడు షరతులకు అంగీకరిస్తే దౌత్యానికి ఇంకా అవకాశం ఉందని తెలిపారు. ఆంక్షల ఎత్తివేత, అమెరికా సైనిక ఉనికిని తగ్గించడం, స్తంభింపజేసిన ఆస్తుల విడుదల, చమురు మినహాయింపుల పునరుద్ధరణ వంటివి ఈ షరతులలో ఉన్నాయి. ఈ హెచ్చరికల నేపథ్యంలోనే తెరవెనుక దౌత్యపరమైన చర్చలు కూడా కొనసాగుతున్నాయి. అయితే చర్చలు బాగానే సాగుతున్నప్పటికీ, ఇరాన్ "అంత నమ్మదగినది కాదు" అని, అవసరమైతే వారి అణు కేంద్రాలపై దాడి చేసే అవకాశం ఉందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించడం ఉద్రిక్తతలను మరింత పెంచుతోంది.

కాంగ్రెస్ రాజ్యాంగ పరిరక్షణ పేరుతో విచిత్ర నాటకం ఆడుతోంది

ఓటర్ల జాబితా ప్రక్షాళనపై దుష్ప్రచారం తగదు: ఎంపీ ఈటల రాజేందర్
అమిత్ షా మహా పాదయాత్రను విజయవంతం చేయాలి
డంపింగ్ యార్డు తరలించే వరకు పోరాటం ఆగదు
ఫాక్స్ సాగర్ వద్ద దేవాలయాల కూల్చివేతలపై ప్రభుత్వానికి ప్రశ్నలు



హైదరాబాద్, నవంబర్ 2 (వాయిస్ టుడే): రాజ్యాంగాన్ని కాపాడాలంటూ కాంగ్రెస్ పార్టీ విచిత్రమైన రాజకీయ నాటకానికి తెరలేపిందని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ విమర్శించారు. దేశ ప్రజాస్వామ్య వ్యవస్థలను కించపరుస్తూ, విదేశాల్లో భారతదేశ ప్రతిష్టను దిగజార్చే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. నవంబర్ 2న నిర్వహించనున్న మహా పాదయాత్రకు సంబంధించి మేడ్చల్--మల్కాజిగిరి (అర్బన్) జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు తెలిపారు.

ఎస్ఐఆర్‌పై కాంగ్రెస్ దుష్ప్రచారం చేస్తోంది

స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియను బీజేపీ కొత్తగా ప్రారంభించలేదని, 1952 నుంచి ఇప్పటివరకు 13 సార్లు ఈ ప్రక్రియ జరిగిందని ఈటల రాజేందర్ పేర్కొన్నారు. 2002 తర్వాత సుమారు 24 ఏళ్లకు మళ్లీ ఈ ప్రక్రియ చేపడుతున్నారని వివరించారు. మరణించినవారి పేర్లు, వలస వెళ్లినవారి పేర్లు, డూప్లికేట్ ఓట్లను తొలగించకూడదా? అని ప్రశ్నించారు. ఒకే వ్యక్తికి రెండు చోట్ల ఓట్లు ఉండటం, చిరునామా మారినప్పటికీ పాత ప్రాంతంలో ఓటు కొనసాగడం వంటి సమస్యలను సరిచేయడమే ఈ ప్రక్రియ ఉద్దేశమని తెలిపారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో సుమారు 8 లక్షల ఓట్లు ఉంటే మూడున్నర లక్షల మంది మాత్రమే ఓటు వేస్తున్నారని, మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలో 39 లక్షల ఓటర్లకు గాను సుమారు 50 శాతం మాత్రమే పోలింగ్ జరుగుతోందని చెప్పారు. హైదరాబాద్‌లో నివసిస్తున్న అనేకమందికి వారి స్వగ్రామాల్లోనూ ఓట్లు ఉండటంతో ఎన్నికల సమయంలో అక్కడికి వెళ్లి ఓటు వేస్తున్నారని వివరించారు. మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలో సుమారు 13 లక్షల ఓట్లను తొలగించినట్లు చెబుతూ, అవన్నీ ఒకే వర్గానికి చెందినవిగా కాంగ్రెస్ ప్రచారం చేయడం సరికాదన్నారు. మరణించినవారు, చిరునామా మార్చుకున్నవారు, ఇతర ప్రాంతాలకు ఓటు బదిలీ చేసుకున్నవారు, డూప్లికేట్ ఓట్లు ఉన్నవారి వివరాలను మాత్రమే పరిశీలిస్తున్నారని పేర్కొన్నారు.

ఈవీఎంలపై కాంగ్రెస్ ఆరోపణలకు సమాధానం చెప్పాలి

ఈవీఎంలను ప్రవేశపెట్టిన కాంగ్రెస్ పార్టీయే ఇప్పుడు వాటి విశ్వసనీయతపై ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందని ఈటల విమర్శించారు. ఈవీఎంలలో ట్యాంపరింగ్ జరిగితే బీజేపీకి 400 సీట్లు వస్తాయని ప్రచారం జరిగినప్పటికీ, 2024 ఎన్నికల్లో 340 సీట్లు కూడా రాలేదని ప్రశ్నించారు. ఈవీఎంలపై అనుమానాలు వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు 2023లో తెలంగాణలో, కేరళ, కర్ణాటక, తమిళనాడు, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాల్లో కాంగ్రెస్ లేదా దాని మిత్రపక్షాలు సాధించిన విజయాల గురించి కూడా సమాధానం చెప్పాలని అన్నారు. ఎన్నికల కమిషన్‌పై ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయడం, సుప్రీంకోర్టు, పార్లమెంట్ వ్యవస్థల ప్రతిష్టను దిగజార్చడం తగదని పేర్కొన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారతదేశాన్ని అంతర్జాతీయంగా అపహాస్యం చేయవద్దని సూచించారు.

అమిత్ షా మహా పాదయాత్రను విజయవంతం చేయాలి

దేశ ప్రజాస్వామ్య వ్యవస్థలను పరిరక్షించాలనే లక్ష్యంతో పార్టీలకు, జెండాలకు అతీతంగా మేధావులు, విద్యార్థులు, యువత, దేశభక్తులు ఈ మహా పాదయాత్రలో భాగస్వాములు కావాలని ఈటల రాజేందర్ పిలుపునిచ్చారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా నేతృత్వంలో హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియం సమీపంలోని నిజాం కాలేజీ వద్ద ఉన్న బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం నుంచి పాదయాత్ర ప్రారంభమై మొజాంజాహీ మార్కెట్ వరకు కొనసాగుతుందని తెలిపారు. హైదరాబాద్ పరిసర ప్రాంతాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని పాదయాత్రను విజయవంతం చేయాలని కోరారు. దేశ స్వాతంత్ర్యం ఎందరో మహనీయుల త్యాగాల ఫలితమని, దేశాన్ని అస్థిరపరిచే శక్తుల నుంచి కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు.

డంపింగ్ యార్డు తరలించే వరకు పోరాటం

డంపింగ్ యార్డు సమస్యపై మాట్లాడుతూ.. ప్రజల ఆరోగ్యానికి ముప్పుగా మారిన డంపింగ్ యార్డును తొలగించే వరకు తన పోరాటం కొనసాగుతుందని ఈటల స్పష్టం చేశారు. తాను రాజకీయ ప్రయోజనాల కోసం పాదయాత్ర చేస్తున్నానని విమర్శిస్తే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పార్లమెంట్‌లో ఈ అంశాన్ని ఎందుకు ప్రస్తావించారని ప్రశ్నించారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (చీ+)లో కేసు ఎందుకు దాఖలైందని నిలదీశారు. డంపింగ్ యార్డు కారణంగా స్థానిక ప్రజలు అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని, పలువురు మరణిస్తున్నారని పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ కోసం ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు.

ఫాక్స్ సాగర్ వద్ద దేవాలయాల కూల్చివేతలపై ఆగ్రహం

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని ఫాక్స్ సాగర్ పరిసరాల్లో హైడ్రా చేపడుతున్న చర్యలపై ఈటల రాజేందర్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. హిందూ దేవాలయాలపై వివక్షతో కూల్చివేతలు చేపడుతున్నారని ఆరోపించారు. చెరువులను పరిరక్షించడం ప్రభుత్వ బాధ్యతేనని, అయితే ఆ పేరుతో దేవాలయాలు, పేదల ఇళ్లను కూల్చడం సరికాదన్నారు. ఫాక్స్ సాగర్ కట్ట కింద సుమారు 18 దేవాలయాలు ఉన్నాయని, మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం మినీ ఇండియా వంటిదని, వివిధ రాష్ట్రాల ప్రజలు తమ విశ్వాసాలకు అనుగుణంగా దేవాలయాలు నిర్మించుకున్నారని తెలిపారు. ఫాక్స్ సాగర్‌లోకి మురుగునీరు చేరకుండా చర్యలు తీసుకుంటే స్వాగతిస్తామని, కానీ దేవాలయాలను లక్ష్యంగా చేసుకోవడం సరికాదని అన్నారు. హైడ్రా పేదలు, సామాన్యులపై చర్యలు తీసుకుంటోందని, పెద్దల ఆక్రమణల విషయంలోనూ సమానంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. ఎల్లమ్మబండ, షాంషీగూడ ప్రాంతాల్లో భూవివాదాలు, ఆక్రమణలపై ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఐడీఎల్ పరిధిలోని భూములు, హానర్ హోమ్స్ ప్రాజెక్టుకు సంబంధించిన భూముల వ్యవహారంపై కూడా ఆయన పలు ఆరోపణలు చేశారు. సుమారు రూ.15 వేల కోట్ల విలువైన భూముల వ్యవహారంపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. హానర్ హోమ్స్‌తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లాలూచీ పడ్డారని ఈటల ఆరోపించారు. ఈ ఆరోపణలపై ప్రభుత్వం, సంబంధిత సంస్థల వివరణ అందుబాటులోకి రావాల్సి ఉంది. చెరువులు, ప్రభుత్వ భూములను కాపాడాల్సిందేనని, అదే సమయంలో పేదల నివాసాలు, ప్రజల ఆస్తులు, మతపరమైన విశ్వాసాలను గౌరవించాలని పేర్కొన్నారు. ప్రజల ఆస్తులను పరిరక్షించడం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు.

మీడియా సమావేశంలో పాల్గొన్నవారు

ఈ మీడియా సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు డి. గిరివర్ధన్ రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి తాడూరి శ్రీనివాస్ రావు, రాష్ట్ర నాయకులు డా. ఎస్. మల్లారెడ్డి, జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షులు జేకే శేఖర్ యాదవ్, జిల్లా యువ మోర్చా అధ్యక్షులు శ్రీనాథ్, సీనియర్ నాయకులు వీకే మహేష్, గరిగె శేఖర్ ముదిరాజ్, సౌరబ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

VOICE OF PRAJALU
వాయిస్
ప్రజల గొంతుక - నిజం కోసం..
ఆఫ్ ప్రజలు





దసరా ప్రీతి మిలన్ -- అలయ్ బలయ్ వేడుకలు

నకాష్ సంఘం 65 వసంతాల వైభవోత్సవం

బోడుప్పల్, వాయిస్ టుడే న్యూస్, నవంబర్ 01 : శ్రీ మాతా నిమిషాంబ దేవి అమ్మవారి దివ్య ఆశీస్సులతో, రాష్ట్ర నకాష్ సంఘం, హైదరాబాద్ కేంద్రం, తెలంగాణ రాష్ట్రం ఆధ్వర్యంలో దసరా ప్రీతి మిలన్ -- అలయ్ బలయ్ మరియు నకాష్ సంఘం 65 వసంతాల వైభవోత్సవ వేడుకలు ఆదివారం నాడు బోడుప్పల్‌లోని శ్రీ మాతా నిమిషాంబ దేవి ఆలయ ప్రాంగణంలో గల శ్రీ మాతా నిమిషాంబ భవన్‌లో అత్యంత వైభవంగా నిర్వహించబడ్డాయి.నకాష్ బంధువుల మధ్య ఐకమత్యం, ప్రేమాభిమానాలు, ఆత్మీయత, సత్సంబంధాలను మరింత బలోపేతం చేయడంతో పాటు, పూర్వీకుల నుంచి వారసత్వంగా అందిన నకాష్ కులవృత్తి గొప్పతనాన్ని, కళా నైపుణ్యాన్ని, సంస్కృతి సంప్రదాయాలను భావితరాలకు పరిచయం చేయాలనే మహోన్నత సంకల్పంతో ప్రతి సంవత్సరం దసరా పండుగ సందర్భంగా ఈ ప్రీతి మిలన్ -- అలయ్ బలయ్ కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.ఈ ఏడాది వేడుకలకు మరింత ప్రత్యేకతను సంతరించుకుంటూ, నకాష్ సంఘం స్థాపించి 65 సంవత్సరాలు పూర్తిచేసుకున్న చారిత్రక శుభతరుణాన్ని పురస్కరించుకొని 1961--2026 వరకు సాగిన ఆరు దశాబ్దాలకు పైబడిన సంఘ ప్రస్థానాన్ని, సంఘ ఐకమత్యానికి, బంధుత్వానికి, సేవాభావానికి, కులవృత్తి పరిరక్షణకు చేసిన కృషిని స్మరించుకుంటూ 65 వసంతాల వైభవోత్సవాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, సంఘం స్థాపించిన నాటి నుంచి నేటి వరకు అనేక మంది పెద్దలు, సంఘ నాయకులు, సభ్యులు అందించిన సేవలు, సహకారం, అంకితభావం అభినందనీయమని పేర్కొన్నారు. సంఘ ఐకమత్యాన్ని మరింత బలోపేతం చేస్తూ, మన వారసత్వ సంపదగా నిలిచిన నకాష్ కళను, కులవృత్తిని పరిరక్షించి, భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆకాంక్షించారు.

ఈ వేడుకల్లో భాగంగా నకాష్ బంధువులందరికీ ఆత్మీయంగా సంప్రదాయ సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేయడంతో పాటు, బాలబాలికలకు మరియు ఆడపడుచులకు వివిధ ఆటల పోటీలు, వినోద కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. కుటుంబ సభ్యుల సమేతంగా పెద్ద సంఖ్యలో బంధువులు పాల్గొని, పరస్పర ప్రేమాభిమానాలను పంచుకుంటూ, ఉత్సాహభరిత వాతావరణంలో వేడుకలను విజయవంతం చేశారు.ఇలాంటి ఆత్మీయ సమ్మేళనాలు కేవలం వేడుకలకే పరిమితం కాకుండా, సమాజంలోని ఐకమత్యాన్ని, పరస్పర సహకారాన్ని, సామాజిక బాధ్యతను పెంపొందించే వేదికలుగా నిలుస్తాయని భావించారు.

65 సంవత్సరాల సంఘ ప్రస్థానం మన పెద్దల కృషికి నిదర్శనం. రాబోయే తరాలకు ఐకమత్యం, వారసత్వం, సేవాభావం అందించడమే లక్ష్యంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు.ముఖ్యఅతిథిలుగా బీసీ డెడికేషన్ కమిషన్ ప్రత్యేక చైర్మన్ భూసాని వెంకటేశ్వర రావు, ఐ.ఏ.ఎస్., రిటైర్డ్, పద్మశ్రీ అవార్డు గ్రహీత నాంపల్లి దివాకర్, రిటైర్డ్ డైరెక్టర్, డి.ఆర్.డి.ఎల్ పాల్గొనడం జరిగింది.ఈ కార్యక్రమానికి నకాష్ బంధువులు మరియు ఆలయ కమిటీలు కార్యవర్గ సభ్యులు కుటుంబ సభ్యుల సమేతంగా పాల్గొనడం జరిగింది. మరియు కె. అశోక్ కుమార్, అసోసియేట్ అధ్యక్షుడు, కొరిచర్ల శ్రీనివాస్ రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఆలయ చైర్మన్ కామరౌతు వినోద్ కుమార్, ధనలకోట సతీష్, సహాయ కోశాధికారి, ఉపాధ్యక్షులు ధనలకోట నర్సింగ్ రావు, కార్యదర్శులు రామగిరి శ్రీకాంత్, ముత్యాల శ్రీనివాస్, నాంపల్లి శ్రీకాంత్, హిమచందర్, ఎన్. రమేష్, నానాగిరి రామకృష్ణ, ఎమ్. శ్యామ్, డి. రామకృష్ణ, డి. నరేష్, కె. ప్రవీణ్ కుమార్, మోహన్, సత్యనారాయణ మరియు వివిధ జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొనడం జరిగింది.

విల్లా మేరీ మహిళా డిగ్రీ కళాశాల స్నాతకోత్సవం 2026



విల్లా మేరీ మహిళా డిగ్రీ కళాశాల, హైదరాబాద్‌లోని సోమాజిగూడలో గల విల్లా మేరీ కళాశాలలోని సెయింట్ జోసెఫ్ ఆడిటోరియంలో, 2023-2026 గ్రాడ్యుయేటింగ్ బ్యాచ్‌కు అండర్ గ్రాడ్యుయేట్ డిగ్రీలను ప్రదానం చేస్తూ తన స్నాతకోత్సవం 2026ను ఘనంగా నిర్వహించింది.

ఈ కార్యక్రమానికి ఉస్మానియా విశ్వవిద్యాలయం గౌరవ వైస్-ఛాన్సలర్ శ్రీ ప్రొఫెసర్ కుమార్ మొలుగారం గారు ముఖ్య అతిథిగా విచ్చేశారు. పట్టభద్రులైన విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ, సమర్థులైన, బాధ్యతాయుతమైన మరియు భవిష్యత్తుకు సిద్ధంగా ఉండే పట్టభద్రులను తీర్చిదిద్దడంలో నాణ్యమైన విద్య యొక్క ప్రాముఖ్యతను వైస్-ఛాన్సలర్ నొక్కి చెప్పారు. వినూత్న విద్యా బోధనా పద్ధతుల ద్వారా మహిళాభివృద్ధికి మార్గదర్శకత్వం వహించడంలో విల్లా మేరీ మహిళా డిగ్రీ కళాశాల చేస్తున్న కృషిని ఆయన అభినందించారు. మహిళలు విద్యాపరంగా మరియు వృత్తిపరంగా రాణించడానికి అవసరమైన అర్థవంతమైన అభ్యాస అనుభవాలను అందించడంలో మరియు అవకాశాలను కల్పించడంలో ఈ సంస్థ తీసుకున్న చొరవలను ఆయన ప్రశంసించారు.



ఢిల్లీ 'ఓట్ బచావో -- దేశ్ బచావో' నిరసనలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్

కుత్బుల్లాపూర్ నవంబర్ 1(వాయిస్ టుడే) ఏఐసీసీ ఆధ్వర్యంలో ఆదివారం ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో నిర్వహించిన 'దేశ్ బచావో -- ఓట్ బచావో' భారీ నిరసన కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ పాల్గొన్నారు ఈ కార్యక్రమానికి లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌తో పాటు ఇండియా కూటమి పార్టీల నాయకులు, కాంగ్రెస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు ఈ సందర్భంగా దేశంలో ఓటర్ల జాబితాల్లో అక్రమాలు, ఓటు చోరీ ఆరోపణలు, ప్రజాస్వామ్య వ్యవస్థ పరిరక్షణ వంటి అంశాలను నాయకులు ప్రస్తావించారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతను కాపాడాలని, ప్రతి ఓటరుకు తన ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సంఘం నిష్పక్షపాతంగా వ్యవహరించి ప్రజాస్వామ్యంపై ప్రజలకు విశ్వాసం కల్పించాలని పిలుపునిచ్చారు.ప్రజాస్వామ్య పరిరక్షణ, ఓటు హక్కు కాపాడటమే లక్ష్యంగా నిర్వహించిన ఈ నిరసన కార్యక్రమంలో కూన శ్రీశైలం గౌడ్ పాల్గొని కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ఉద్యమానికి సంఘీభావం తెలిపారు.



ఘనంగా మంత్రి వాకిటి శ్రీహరి జన్మదిన వేడుకలు

బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్ నేతృత్వంలో మంత్రిని కలిసిన ముదిరాజ్ నాయకులు, కార్యకర్తలు

కుత్బుల్లాపూర్ నవంబర్ 1(వాయిస్ టుడే): తెలంగాణ రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి ముదిరాజ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముదిరాజ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్ నేతృత్వంలో పెద్ద సంఖ్యలో ముదిరాజ్ నాయకులు, కార్యకర్తలు శనివారం రాత్రి మంత్రి నివాసానికి చేరుకుని జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.హంగు, ఆర్భాటాలకు దూరంగా ఉండే మంత్రి శ్రీహరి.. తనను కలిసేందుకు వచ్చిన నాయకులు, కార్యకర్తలు తీసుకొచ్చిన పూలదండలు, ఫ్లవర్ బొకేలను సున్నితంగా తిరస్కరిస్తూనే అందరినీ ఆప్యాయంగా పలకరించారు. వారి అభిమానానికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకుడు, బాచుపల్లి మాజీ సర్పంచ్ ఆగం పాండు ముదిరాజ్ వినాయకుడి విగ్రహాన్ని మంత్రికి బహూకరించి ప్రత్యేకంగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు చొప్పరి శంకర్ ముదిరాజ్, బీసీ జర్నలిస్ట్ ఫోరం కన్వీనర్ బలరామ్ ముదిరాజ్, ముదిరాజ్ నాయకులు అల్లుడు జగన్ ముదిరాజ్, శివయ్య ముదిరాజ్, జర్నలిస్ట్ పాండు ముదిరాజ్ ఏ పి ఎం యూత్ బాచుపల్లి సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొని మంత్రి వాకిటి శ్రీహరిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి జన్మదిన వేడుకల సందర్భంగా నాయకులు, కార్యకర్తల సందడి నెలకొంది. మంత్రి శ్రీహరి అందరినీ ఆప్యాయంగా పలకరించడం, సాదాసీదాగా వేడుకలు నిర్వహించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

ఢిల్లీ 'ఓట్ బచావో -- దేశ్ బచావో'లో పాల్గొన్న నెల్లిబండ గ్రామ మాజీ ఉప సర్పంచ్ బొడ్డుపల్లి లక్ష్మణ్



కుత్బుల్లాపూర్ నవంబర్ 1(వాయిస్ టుడే): దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణ, ఓటు హక్కు సంరక్షణే లక్ష్యంగా ఏఐసీసీ ఆధ్వర్యంలో ఆదివారం న్యూఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో నిర్వహించిన 'దేశ్ బచావో -- ఓట్ బచావో' భారీ నిరసన కార్యక్రమంలో నకిరేకల్ నియోజకవర్గ శాసనసభ్యులు వేముల వీరేశం నాయకత్వంలో నకిరేకల్ నియోజకవర్గం నెల్లిబండ గ్రామ మాజీ ఉప సర్పంచ్ బొడ్డుపల్లి లక్ష్మణ్ పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌తో పాటు ఇండియా కూటమి భాగస్వామ్య పార్టీల నాయకులు, దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో హాజరయ్యారు.ఈ సందర్భంగా దేశంలో ఓటర్ల జాబితాల నిర్వహణలో అక్రమాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు, ఓటు చోరీ అంశం, ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, ప్రజాస్వామ్య వ్యవస్థ పరిరక్షణ వంటి కీలక అంశాలపై నాయకులు తమ గళం వినిపించారు. ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయాలంటే ఎన్నికల ప్రక్రియలో పూర్తి పారదర్శకత ఉండాలని, ప్రతి పౌరుడికి తన ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునే హక్కును కాపాడాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సంఘం నిష్పక్షపాతంగా వ్యవహరిస్తూ ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందించాలని పిలుపునిచ్చారు.నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం నాయకత్వంలో ఈ నిరసన కార్యక్రమంలో బొడ్డుపల్లి లక్ష్మణ్ పాల్గొని కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమానికి సంఘీభావం తెలిపారు. ఓటు హక్కు పరిరక్షణ కోసం పార్టీ నాయకత్వం చేపట్టిన పోరాటంలో భాగస్వామ్యం కావడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించే లక్ష్యంతో నియో స్టార్ హాస్పిటల్ అభివృద్ధి చెందాలి

- బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్



కుత్బుల్లాపూర్ నవంబర్ 1(వాయిస్ టుడే): 125 - గాజుల రామారం డివిజన్ చిత్తారమ్మ దేవాలయం సమీపంలో డాక్టర్ డి.శ్వేతా, ఎంబీబీఎస్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన నియో స్టార్ హాస్పిటల్ ను బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... నిరుపేదలు అధికంగా నివసించే కుత్బుల్లాపూర్ ప్రాంతంలో అత్యుత్తమ సాంకేతిక పరిజ్ఞానంతో ఇలాంటి హాస్పిటల్ సేవలు ఏర్పాటుచేయడం అభినందనీయమని, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించే లక్ష్యంతో నియో స్టార్ హాస్పిటల్ దినదినాభివృద్ధి చెందాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అమిత్ షా మహాపాదయాత్రలో పెద్ద సంఖ్యలో పాల్గొనాలి

కాంగ్రెస్ ప్రజా వ్యతిరేక విధానాలను నిలదీయాలి: పోతగాని గోపాల్ గౌడ్



నాచారం (వాయిస్ టుడే): దేశ ప్రజల తీర్పుకు వ్యతిరేకంగా విపక్ష పార్టీలు వ్యవహరిస్తున్న తీరును నిరసిస్తూ, రాజ్యాంగ వ్యవస్థల పరిరక్షణ కోసం కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా చేపట్టనున్న మహాపాదయాత్రలో ఉప్పల్ నియోజకవర్గ ప్రజలు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేయోభిలాషులు, జాతీయవాదులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా అధికార ప్రతినిధి పోతగాని గోపాల్ గౌడ్ పిలుపునిచ్చారు. బషీర్‌బాగ్‌లోని బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం నుంచి మొజంజాహీ మార్కెట్ చౌరస్తా వరకు ఈ మహాపాదయాత్ర నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థల పరిరక్షణ, విపక్షాల వైఖరికి నిరసనగా చేపడుతున్న ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై విజయవంతం చేయాలని కోరారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రజలు సంఘటితంగా ముందుకు రావాలని గోపాల్ గౌడ్ పేర్కొన్నారు.



ఖేలో ఇండియా యువజన క్రీడలకు కళరిపయట్టు క్రీడాకారులకు ప్రత్యేక శిక్షణ

ఎల్బీ స్టేడియంలో నవంబర్ 2 వరకు శిబిరం.. 19వ జాతీయ ఛాంపియన్‌షిప్‌లోనూ పాల్గొనే అవకాశం

నాచారం (వాయిస్ టుడే):రానున్న ఖేలో ఇండియా యువజన క్రీడలకు సిద్ధమవుతున్న కళరిపయట్టు క్రీడాకారుల కోసం భారతీయ కళరిపయట్టు సమాఖ్య (ఐకేఎఫ్), తెలంగాణ కళరిపయట్టు సంఘం (కేటీజీ) సంయుక్త ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నారు. తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ సహకారంతో ఈ నెల 29 నుంచి నవంబర్ 2వ తేదీ వరకు ఎల్బీ ఇండోర్ స్టేడియంలో ఈ శిబిరం కొనసాగుతోంది. ఈ శిబిరంలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను తదుపరి దశలో మరింత కఠినమైన శిక్షణకు ఎంపిక చేయనున్నారు. పోటీలకు అవసరమైన మెళకువలు, సాంకేతిక నైపుణ్యాలు, పోటీ నిబంధనలపై నిపుణులు అవగాహన కల్పిస్తున్నారు. భారతీయ కళరిపయట్టు సమాఖ్య ప్రధాన కార్యదర్శి డాక్టర్ అంబు ఆర్. నాయర్, కార్యవర్గ సభ్యులు, సాంకేతిక అధికారి శ్రీజయన్ పి.ఈ. గురుక్కల్, సాంకేతిక అధికారి అంబరీష్ గురుక్కల్‌తో పాటు తెలంగాణ కళరిపయట్టు సంఘం ప్రతినిధులు శిక్షణ ఇస్తున్నారు. ఖేలో ఇండియా క్రీడలతో పాటు నవంబర్ 27, 28, 29 తేదీల్లో కేరళలోని తిరువనంతపురంలో జరగనున్న 19వ జాతీయ కళరిపయట్టు ఛాంపియన్‌షిప్-2026లోనూ పాల్గొనేందుకు క్రీడాకారులకు ఈ శిబిరం ఉపయోగపడనుంది. సంప్రదాయ భారతీయ యుద్ధకళ అయిన కళరిపయట్టును ప్రోత్సహించడంతో పాటు యువ క్రీడాకారుల్లో ప్రతిభను వెలికితీసి జాతీయ స్థాయి పోటీలకు సిద్ధం చేయడమే ఈ శిక్షణ శిబిరం ముఖ్య ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.

ఢిల్లీ 'ఓట్ బచావో -- దేశ్ బచావో' నిరసన కార్యక్రమంలో పాల్గొన్న కొలన్ హన్మంత్ రెడ్డి



కుత్బుల్లాపూర్ నవంబర్ 1(వాయిస్ టుడే): ఏఐసీసీ పిలుపు మేరకు టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో నిర్వహించిన 'ఓట్ బచావో -- దేశ్ బచావో' భారీ నిరసన కార్యక్రమంలో మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి, టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతి రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ప్రజాస్వామ్య పరిరక్షణ, ఓటు హక్కు రక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ఈ ఉద్యమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఓటు హక్కు పవిత్రతను కాపాడేందుకు, రాజ్యాంగ విలువలను పరిరక్షించేందుకు కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు, డిసిసి కమిటీ సభ్యులు, డివిజన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వాయిస్ VOICE OF PRAJALU ప్రజల గొంతుక - నిజం కోసం.. ఆఫ్ ప్రజలు
హైదరాబాద్
సోమవారం 2 నవంబరు 2026

భువనగిరి పట్టణంలో ముదిరాజ్‌ల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తాం

ముదిరాజ్ సంఘం భువనగిరి పట్టణ కమిటీ అధ్యక్షులు ఎనబోయిన జహంగీర్, ప్రధాన కార్యదర్శి నీల శ్రీనివాస్



భువనగిరి పట్టణంలో ముదిరాజుల పూర్తిస్థాయి పట్టణ కమిటీ ఏర్పాటు

యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో (వాయిస్ టుడే ప్రతినిధి):- భువనగిరి పట్టణంలో పూర్తిస్థాయి ముదిరాజ్ ల కమిటీని ఏర్పాటు చేసి ముదిరాజ్ జాతి అభివృద్ధి కోసం సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ముదిరాజ్ సంఘం భువనగిరి పట్టణ కమిటీ అధ్యక్షులు ఎనబోయిన జహంగీర్, ప్రధాన కార్యదర్శి నీల శ్రీనివాస్ లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. భువనగిరి పట్టణంలోని ముదిరాజ్ సంఘం తరపున చేపట్టబోయే కార్యక్రమాలను వివరించారు. పదో తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీలో భువనగిరి పట్టణంలో అత్యధిక మార్కులు సాధించిన ముదిరాజ్ విద్యార్థులకు ప్రతి సంవత్సరం సన్మాన కార్యక్రమం నిర్వహించి నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. యువత చెడు అలవాట్లకు బానిసై కుటుంబాలు నాశనం అవుతున్న నేపథ్యంలో మద్యం, గుట్కా, ఆన్ లైన్ గేమ్స్ పై అవగాహన కల్పించేందుకు అనుభవజ్ఞులైన మంచి వక్తలతో కౌన్సిలింగ్ కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. క్రీడా ఆసక్తి గల విద్యార్థులకు ప్రోత్సాహం అందించడం జరుగుతుంది.



అనాథ లేక నిరుపేదలకు ఉన్నత చదువులు చదవడానికి సహకారం అందిస్తామని తెలిపారు. ముదిరాజ్ ముద్దుబిడ్డ పండుగ సాయన్న విగ్రహాన్ని భువనగిరిలో ఏర్పాటు చేసి ప్రతి సంవత్సరం జయంతి వర్ధంతి కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ముదిరాజ్ లు సామాజిక, విద్య, ఆర్థిక, రాజకీయ రంగాలలో రాణించేందుకు తమ కమిటీ కృషి చేస్తుందని, ఈ కార్యక్రమం విజయవంతం అయ్యేందుకు అందరూ తమ ఆలోచనలు, సూచనలు, సలహాలు అందించాలని కోరారు. మరిన్ని వివరాల కోసం 99514 49951, 99890 67336, 93907 40766 ఫోన్ నెంబర్లకు మెసేజ్ లేక నేరుగా తెలుపాలని వారు విజ్ఞప్తి చేశారు.



క్రీడలతో మానసిక ఒత్తిడిని జయించవచ్చు

ఆర్‌వీ స్పోర్ట్స్ క్లబ్ ప్రారంభోత్సవంలో మాజీ క్రికెటర్లు

నాచారం (వాయిస్ టుడే): క్రీడలతో మానసిక ఒత్తిడిని జయించడంతో పాటు శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చని వెటరన్ క్రికెటర్ ఎస్. ఖన్నాన్, మాజీ ఇండియన్ రైల్వే క్రికెటర్ సురేష్ అన్నారు. నాచారంలోని రహేజా విస్టా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆర్‌వీ స్పోర్ట్స్ క్లబ్‌ను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నేటి యువత మొబైల్ ఫోన్లు, ఇంటర్నెట్‌కు ఎక్కువగా అలవాటు పడుతున్నారని, వారిని ఆ అలవాట్ల నుంచి దూరం చేసి క్రీడల వైపు ప్రోత్సహించేందుకు స్పోర్ట్స్ క్లబ్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. చిన్నతనం నుంచే పిల్లలకు క్రీడలపై ఆసక్తి పెంపొందించాలని సూచించారు. పిల్లల్లో క్రీడా నైపుణ్యాలను వెలికితీయడంతో పాటు ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చడమే క్లబ్ లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారుల జెర్సీలను ఆవిష్కరించారు.



ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై కాంగ్రెస్ దృష్టి...

ఉప్పల్ మాజీ కార్పొరేటర్ మందుముల రజితాపరమేశ్వర్‌రెడ్డి

ఉప్పల్‌లో ఓటరు నమోదుకు ప్రత్యేక కార్యక్రమం...
ఉప్పల్ మాజీ కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి

ఉప్పల్ (వాయిస్ టుడే ప్రతినిధి):- ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా ఉప్పల్ భారత్ నగర్ లోని మాల్ మైసమ్మ దేవాలయం వద్ద ఆదివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. కాంగ్రెస్ యువ నాయకుడు బచ్చ శివకుమార్ కురుమ ఆధ్వర్యంలో, ఈ కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ కార్పొరేటర్ మందుముల రజితాపరమేశ్వర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియలో అర్హులైన వారు భాగస్వాములు కావాల్సిన అవసరాన్ని ఆమె వివరించారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో కీలకమని, అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ తమ పేరును ఓటరు జాబితాలో నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియపై ప్రజలకు అవగాహన కల్పించడమే కార్యక్రమం ప్రధాన ఉద్దేశంగా నిర్వహించారు. కార్యక్రమంలో బజార్ జగన్నాథ గౌడ్, తుమ్మల దేవి రెడ్డి, లింగంపల్లి రామకృష్ణ, భూసం రఘునాథరెడ్డి, అలుగు అనిల్, సతీష్ ముదిరాజ్, బచ్చారాం, బజార్ నవీన్ గౌడ్, టైసిన్, బడిగా మల్లేష్, సోమ మహేష్, బింగి మహేష్ గౌడ్,బంటి, తదితరులు పాల్గొన్నారు.

ఓటు చోరీకి వ్యతిరేకంగా ఢిల్లీలో కాంగ్రెస్ సమరభేరి


రాంలీలా మైదానంలో ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమంలో పాల్గొన్న ఏ డా. సత్యం శ్రీరంగం



కూకట్‌పల్లి, నవంబర్ 1(వాయిస్ టుడే): దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణ, ఓటు హక్కు పవిత్రతను కాపాడాలనే లక్ష్యంతో కాంగ్రెస్ పార్టీ, ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాలు ఢిల్లీలోని చారిత్రాత్మక రాంలీలా మైదానంలో నిర్వహించిన 'ఓట్ చోరీ' వ్యతిరేక సమరభేరికి భారీగా తరలివచ్చాయి. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యులు, టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం పాల్గొని కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమానికి సంఘీభావం తెలిపారు.

ఈ సందర్భంగా డా. సత్యం శ్రీరంగం మాట్లాడుతూ.. దేశంలో బీజేపీ మరోసారి అధికారంలోకి రావడానికి అడ్డదారులు తొక్కుతోందని విమర్శించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ పేరుతో ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా అర్హులైన కోట్లాది మంది ఓటర్ల పేర్లను ఓటరు జాబితాల నుంచి తొలగిస్తూ వారి హక్కులను హరించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. ప్రజల ఓటు హక్కును కాపాడాల్సిన కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ కేంద్ర ప్రభుత్వ కుట్రలో భాగస్వామిగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు.

ఓట్ల దొంగతనానికి పాల్పడ్డారనే ఆరోపణలపై సీఈసీ జ్ఞానేష్ కుమార్‌పై న్యాయ విచారణ చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. దేశంలోని ప్రతి పౌరుడి ఓటు హక్కును కాపాడాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత పవిత్రమైనదని, ప్రతి ఓటుకు సమాన విలువ ఉండాలని పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియలో పూర్తి పారదర్శకత పాటించాలని, ఓటర్ల జాబితాల్లో అక్రమాలకు తావులేకుండా చూడాలని డిమాండ్ చేశారు. ప్రజల తీర్పే ప్రజాస్వామ్యానికి పునాదని, ఆ తీర్పును గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యతని స్పష్టం చేశారు. ఓటు హక్కు పరిరక్షణ, రాజ్యాంగ విలువల బలోపేతం కోసం కాంగ్రెస్ పార్టీ చేస్తున్న పోరాటంలో ప్రజలంతా భాగస్వాములు కావాలని డా. సత్యం శ్రీరంగం పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి నియోజకవర్గ ఏ, బీ బ్లాక్ అధ్యక్షులు డా. పి. నాగిరెడ్డి, తూము వేణు, మాజీ పట్టణ అధ్యక్షులు సతీష్ రెడ్డి, ఏ, బీ బ్లాక్ మహిళా అధ్యక్షురాళ్లు రమాదేవి, సంధ్య, సీనియర్ నాయకులు సాధు ప్రతాప్ రెడ్డి, కృష్ణ రాజ్‌పుత్, సుంకన్న, తమ్మినేని ప్రవీణ్, విట్టల్ రెడ్డి, వివిధ డివిజన్ల అధ్యక్షులు, మహిళా నాయకురాళ్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావుకు ఎంపీ వద్దిరాజు జన్మదిన శుభాకాంక్షలు

82వ పుట్టినరోజు వేడుకల్లో పాల్గొని శాలువాతో సత్కారం

పాల్వంచ: మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు 82వ పుట్టినరోజు వేడుకలు ఆదివారం పాల్వంచలో ఘనంగా జరిగాయి. ఆయన కుటుంబ సభ్యులు ఏర్పాటు చేసిన ఈ వేడుకలకు బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నాయకుడు, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర హాజరయ్యారు. ఈ సందర్భంగా వనమా వెంకటేశ్వరరావును శాలువాతో సత్కరించిన ఎంపీ వద్దిరాజు రవిచంద్ర హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. వనమా వెంకటేశ్వరరావు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవించాలని ఆకాంక్షించారు.

ఢిల్లీలో 'ఓట్ బచావో.. దేశ్ బచావో' మహా ర్యాలీ

రాంలీలా మైదానంలో పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



న్యూఢిల్లీ (వాయిస్ టుడే): న్యూఢిల్లీలోని రాంలీలా మైదానంలో ఇండియా కూటమి (INDIA Bloc) ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఛలో ఢిల్లీ -- ఓట్ బచావో, దేశ్ బచావో' మహా ర్యాలీలో తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పాల్గొన్నారు. ఓటర్ల జాబితాల సవరణ, ఎన్నికల ప్రక్రియకు సంబంధించి ఇండియా కూటమి వ్యక్తం చేస్తున్న అభ్యంతరాల నేపథ్యంలో ఈ మహా ర్యాలీ నిర్వహించారు. ప్రజాస్వామ్య వ్యవస్థ, ఓటు హక్కు పరిరక్షణ అంశాలను ప్రధానంగా ప్రస్తావిస్తూ కూటమి నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. తెలంగాణ నుంచి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఈ ర్యాలీలో పాల్గొనడం రాష్ట్ర కాంగ్రెస్ శ్రేణుల భాగస్వామ్యాన్ని ప్రతిబింబించింది.

ఓబీసీ కులాలు, ఆదివాసీల మతం నమోదుకు ప్రత్యేక కాలమ్స్ ఏర్పాటు చేయాలి

ప్రత్యేక అసెంబ్లీ, కౌన్సిల్ సమావేశాలు నిర్వహించి తీర్మానం చేయాలి

సీఎం రేవంత్‌రెడ్డికి తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత లేఖ



హైదరాబాద్, నవంబర్ 1 (వాయిస్ టుడే): దేశవ్యాప్తంగా నిర్వహించనున్న జనగణనలో ఓబీసీ కులాల నమోదుకు ప్రత్యేక కాలమ్ ఏర్పాటు చేయడంతో పాటు, ఆదివాసీల మతాన్ని కూడా ప్రత్యేకంగా నమోదు చేసేలా కేంద్ర ప్రభుత్వాన్ని కోరాలని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు, మాజీ ఎంపీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ఈ అంశాలపై చర్చించి తీర్మానాలు చేయడానికి తెలంగాణ శాసనసభ, శాసనమండలి ప్రత్యేక సమావేశాలు వెంటనే నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు.

దేశంలో అత్యధిక జనాభా కలిగిన ఓబీసీల జనాభాపై స్పష్టమైన చట్టబద్ధమైన గణాంకాలు అందుబాటులో లేకపోవడం వల్ల వారికి జనాభా దామాషా ప్రకారం అందాల్సిన ప్రయోజనాలు అందడం లేదని కవిత తన లేఖలో పేర్కొన్నారు. జనగణనలో కులం నమోదుకు అవకాశం ఉన్నప్పటికీ, ఓబీసీలను ప్రత్యేకంగా గుర్తించేందుకు ప్రత్యేక కాలమ్ లేదని, ఫలితంగా వారిని ఇతర కులాల జాబితాలో చేర్చాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని వివరించారు.

ఎస్సీ, ఎస్టీల జనాభాను ప్రత్యేకంగా నమోదు చేస్తున్న విధంగానే ఓబీసీల జనాభాను కూడా ప్రత్యేకంగా నమోదు చేయాలని కోరారు. దీనిపై తెలంగాణ అసెంబ్లీ, కౌన్సిల్‌లో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపాలని సూచించారు. డిసెంబర్ నుంచి ఇంటింటి జనగణన ప్రక్రియ ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రత్యేక సమావేశాలను వీలైనంత త్వరగా నిర్వహించాలని లేఖలో విజ్ఞప్తి చేశారు.

ఆదివాసీల మతాన్ని ప్రత్యేకంగా నమోదు చేయాలి

దేశ మూలవాసులైన ఆదివాసీల జీవన విధానం, ఆచారాలు, సంప్రదాయాలు ప్రత్యేకమైనవని కవిత పేర్కొన్నారు. ప్రకృతి, అడవిని ఆరాధించడం ఆదివాసీ సంస్కృతిలో భాగమని, ఒక్కో తెగకు ప్రత్యేకమైన దేవతలు, పశువులు, పక్షులు, చెట్లను పూజించే సంప్రదాయాలు ఉన్నాయని తెలిపారు.

గతంలో నిర్వహించిన జనగణనలో ఆదివాసీల మతాన్ని ప్రత్యేకంగా నమోదు చేసే అవకాశం ఉండేదని, ప్రస్తుత జనగణనలో ఆ అవకాశం లేకపోవడంపై ఆదివాసీ వర్గాల్లో ఆందోళన వ్యక్తమవుతోందని పేర్కొన్నారు. వారి ప్రత్యేక మత, సాంస్కృతిక గుర్తింపును కాపాడేందుకు జనగణనలో ఆదివాసీల మతాన్ని ప్రత్యేకంగా నమోదు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం చేయాలని సూచించారు. ఓబీసీల జనాభా గణాంకాలు, ఆదివాసీల మతపరమైన గుర్తింపునకు సంబంధించిన అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలని, ప్రత్యేక అసెంబ్లీ, కౌన్సిల్ సమావేశాల నిర్వహణకు ముఖ్యమంత్రి తక్షణ చర్యలు చేపట్టాలని కల్వకుంట్ల కవిత తన లేఖలో కోరారు.

పీటీ స్వామి సేవలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయి

గోదావరిఖనిలో నిలువెత్తు కాంస్య విగ్రహం ఏర్పాటు చేద్దాం

ఎంత ఖర్చయినా బీఆర్ఎస్ పార్టీ భరిస్తుంది: హరీశ్‌రావు



గోదావరిఖని, నవంబర్ 2 (వాయిస్ టుడే): తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) వ్యవస్థాపక అధ్యక్షుడు, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, ప్రముఖ విద్యావేత్త, సమాజ సేవకుడు స్వర్గీయ పీటీ స్వామి సేవలు చరిత్ర పుటల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు తన్నీరు హరీశ్‌రావు అన్నారు. పీటీ స్వామి దశదిన కర్మ సందర్భంగా ఆదివారం గోదావరిఖని మార్కండేయ కాలనీలోని ఆర్‌కే గార్డెన్స్‌లో నిర్వహించిన సంస్మరణ సభకు ఆయన హాజరై స్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. పీటీ స్వామిని కోల్పోవడం ఆయన కుటుంబానికే కాకుండా బీఆర్ఎస్ పార్టీకి, సింగరేణి కార్మిక లోకానికి తీరని లోటని పేర్కొన్నారు. స్వామి మరణవార్త తెలుసుకున్న పార్టీ అధినేత కేసీఆర్ తీవ్రంగా బాధపడ్డారని, సంస్మరణ సభకు పార్టీ ప్రతినిధులుగా తప్పకుండా హాజరుకావాలని ఆదేశించడంతో తాము వచ్చామని తెలిపారు.

టీబీజీకేఎస్ ఆవిర్భావంలో కీలక పాత్ర

పీటీ స్వామిపై కేసీఆర్‌కు ఎంతో అభిమానం, గౌరవం ఉండేవని హరీశ్‌రావు గుర్తుచేశారు. సింగరేణిలో ప్రత్యేకంగా బొగ్గు గని కార్మిక సంఘం ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనపై తొలుత కేసీఆర్ కొంత విముఖత వ్యక్తం చేశారని తెలిపారు. అప్పటికే ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ సంఘాల్లో ఉన్న కార్మికులంతా తెలంగాణ బిడ్డలేనని, ప్రత్యేక సంఘం ఏర్పాటు చేస్తే ఇతర సంఘాల్లోని కార్మికులు ఉద్యమానికి దూరమయ్యే ప్రమాదం ఉందని కేసీఆర్ భావించారని వివరించారు. అయితే పీటీ స్వామి, కొప్పుల ఈశ్వర్ తదితరులు కేసీఆర్‌ను ఒప్పించి టీబీజీకేఎస్ ఏర్పాటుకు కృషి చేశారని చెప్పారు. ప్రత్యేక కార్మిక సంఘం ఏర్పాటు చేస్తే ఉద్యమం, పార్టీ బలోపేతం కావడంతో పాటు కార్మికులకు మేలు జరుగుతుందని వివరించి సంఘం ఏర్పాటులో కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. టీబీజీకేఎస్ ఆవిర్భావానికి మూలకారకుడిగా నిలిచిన పీటీ స్వామి సంఘం తొలి గౌరవ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టారని గుర్తుచేశారు.

26 ఏళ్ల పాటు కేసీఆర్ వెన్నంటి నడిచిన నాయకుడు

2001లో టీఆర్ఎస్ పార్టీ ఆవిర్భవించిన నెల రోజుల్లోపే కొప్పుల ఈశ్వర్, మురళీధర్, పీటీ స్వామి పార్టీలో చేరారని హరీశ్‌రావు తెలిపారు. అప్పటి నుంచి చివరి శ్వాస వరకు 26 ఏళ్ల పాటు కేసీఆర్ వెన్నంటి నడిచారని పేర్కొన్నారు. తాను కూడా ఆయనతో కలిసి 14 ఏళ్లు తెలంగాణ ఉద్యమంలో, పదేళ్లు ప్రభుత్వంలో, అనంతరం ప్రతిపక్షంలో పనిచేశానని గుర్తుచేశారు. పీటీ స్వామికి సెలవు, విశ్రాంతి అనే మాటలు తెలియవని, నిరంతరం పనిచేసే నిత్యశ్రామికుడని కొనియాడారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేసి పదవీ విరమణ అనంతరం పూర్తిస్థాయిలో తెలంగాణ ఉద్యమంలోకి వచ్చారని తెలిపారు. మేధావుల్లో మేధావిగా, కార్మికుల్లో కార్మికుడిగా, విద్యావంతుల్లో విద్యావంతుడిగా, నాయకుల్లో నాయకుడిగా అన్ని వర్గాల గౌరవాన్ని పొందారని అన్నారు.దాదాపు 15 సంవత్సరాల పాటు పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా పనిచేస్తూ సభ్యత్వ నమోదు, ఉద్యమ కార్యక్రమాలు, పార్టీ బలోపేతానికి అంకితభావంతో కృషి చేశారని తెలిపారు. తన ఆరోగ్యం, వ్యక్తిగత సుఖం, డబ్బు, పదవుల గురించి ఆలోచించకుండా నిస్వార్థంగా తెలంగాణ కోసం పోరాడిన గొప్ప ఉద్యమకారుడని ప్రశంసించారు.

కార్మికుల పక్షాన నిలిచిన పోరాట యోధుడు

తెలంగాణ ఉద్యమ సమయంలోనే ఆదిలాబాద్ జిల్లాను తూర్పు, పశ్చిమ ఆదిలాబాద్‌గా విభజించి ఇద్దరు పార్టీ అధ్యక్షులు, ఇన్‌చార్జిలను నియమించినట్లు హరీశ్‌రావు వివరించారు. అప్పట్లో తూర్పు ఆదిలాబాద్, ప్రస్తుత మంచిర్యాల ప్రాంత పార్టీ ఇన్‌చార్జిగా పీటీ స్వామి పనిచేశారని తెలిపారు. కాగజ్‌నగర్ పేపర్ మిల్లు మూతపడిన సమయంలో అక్కడి కార్మికుల పక్షాన నిలబడి పోరాటం చేశారని గుర్తుచేశారు.

గోదావరిఖనిలో నిలువెత్తు కాంస్య విగ్రహం ఏర్పాటు

ఈ సంస్మరణ సభలో రాజకీయాలు మాట్లాడ దలుచుకోలేదని, ఒక నిస్వార్థ ఉద్యమ సహచరుడిని కోల్పోయిన బాధలో ఉన్నామని హరీశ్‌రావు అన్నారు. పీటీ స్వామి సేవలు భావితరాలకు స్ఫూర్తిగా నిలిచేలా గోదావరిఖని గడ్డపై ఆయన నిలువెత్తు కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కొప్పుల ఈశ్వర్, చందర్, రాజిరెడ్డి, స్థానిక పెద్దలను కోరారు. విగ్రహ ఏర్పాటుకు కేసీఆర్ ఆశీస్సులు ఉంటాయని, ఎంత ఖర్చయినా బీఆర్ఎస్ పార్టీ భరిస్తుందని హామీ ఇచ్చారు. వీలైనంత త్వరగా విగ్రహాన్ని ఏర్పాటు చేసుకుందామని తెలిపారు.

వృద్ధాశ్రమ అభివృద్ధికి బీఆర్ఎస్ అండ

పీటీ స్వామి ఆశయాలను, కార్మికుల కోసం ఆయన చేసిన కృషిని కొనసాగించడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని హరీశ్‌రావు అన్నారు. స్వామి ప్రాణప్రదంగా నిర్వహించిన వృద్ధాశ్రమాన్ని భవిష్యత్తులో మరింత గొప్పగా అభివృద్ధి చేసేందుకు కొప్పుల ఈశ్వర్, స్థానిక నాయకత్వం, తాను, బీఆర్ఎస్ పార్టీ పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని ప్రకటించారు. పీటీ స్వామి కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.



కేసీఆర్ పాలనలో వైద్య రంగానికి విశేష ప్రాధాన్యత: ఎంపీ వద్దిరాజు

23 కొత్త జిల్లాల ఏర్పాటు.. మెడికల్, నర్సింగ్ కళాశాలల స్థాపన

కొత్తగూడెం (వాయిస్ టుడే): తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు తన పదేళ్ల పాలనలో అవసరమైన వారందరికీ మెరుగైన వైద్య సేవలు అందించేందుకు విశేష ప్రాధాన్యతనిచ్చారని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నాయకుడు, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని పబ్లిక్ క్లబ్ హాలులో ఆదివారం నిర్వహించిన ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) తెలంగాణ శాఖ 10వ వార్షిక సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ రవిచంద్ర మాట్లాడుతూ.. తెలంగాణలో కొత్తగా 23 జిల్లాలను ఏర్పాటు చేయడంతో పాటు మెడికల్, నర్సింగ్ కళాశాలలను స్థాపించినట్లు తెలిపారు. కేసీఆర్ సంకల్పం, ప్రోత్సాహంతో హైదరాబాద్ మెడికల్ హబ్‌గా రూపాంతరం చెందిందని పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాలతో పాటు పలు దేశాల నుంచి కూడా మెరుగైన వైద్య సేవల కోసం హైదరాబాద్‌కు వస్తున్నారని వివరించారు.

కరోనా సమయంలో వైద్యుల సేవలు అభినందనీయం

కరోనా మహమ్మారి విజృంభించిన సమయంలో వైద్యులు నిరంతరం అందుబాటులో ఉండి ప్రజల ప్రాణాలను కాపాడారని ఎంపీ కొనియాడారు. తమ కుటుంబంలోనూ కుమార్తె గంగాభవాని, పెద్దన్న కుమార్తె భర్త వెంకట్‌తో పాటు మరికొందరు వైద్యులు ఉన్నారని తెలిపారు. హైదరాబాద్, వరంగల్ నగరాల వెలుపల ఐఎంఏ వార్షిక సదస్సును కొత్తగూడెంలో నిర్వహించడం, అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా డాక్టర్ విజయ్ కుమార్ బాధ్యతలు స్వీకరించడం అభినందనీయమన్నారు.

వైద్య ప్రముఖులకు సన్మానం

సదస్సుకు హాజరైన అతిథులను ఎంపీ వద్దిరాజు రవిచంద్ర శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పద్మశ్రీ పురస్కార గ్రహీతలు డాక్టర్ బీ. సోమరాజు, డాక్టర్ ఎ. గోపాలకృష్ణ గోఖలే, డాక్టర్ సూర్యప్రకాష్ రావు, ఐఎంఏ నూతన అధ్యక్షుడు డాక్టర్ విజయ్ కుమార్, డాక్టర్ ప్రవీణ్ రెడ్డి, డాక్టర్ మనీష్ కుమార్ జైన్, డాక్టర్ ఈశ్వర్ బీ. పటేల్, డాక్టర్ అనిల్ కుమార్, డాక్టర్ హరికృష్ణ, డాక్టర్ రవికాంత్, డాక్టర్ ఓంప్రకాష్ సింగ్, డాక్టర్ చందన్ కుమార్, డాక్టర్ సుజీత్ రెడ్డి, డాక్టర్ కేవీవీఎన్ రాజు, డాక్టర్ దాచేపల్లి సునీల్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు దిండిగల రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



ఉచిత హోమియో వైద్య శిబిరాన్ని ప్రారంభించిన మాజీ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్

హిమాయత్‌నగర్, నవంబర్ 01: హిమాయత్‌నగర్‌లోని డాక్టర్ సీ.ఎల్. మోడీ చారిటబుల్ హోమియోపతిక్ డిస్పెన్సరీ ఁ స్పెషాలిటీ క్లినిక్స్ వేదికగా హోమియోపతిక్ మెడికల్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ (హెచ్ మ్యాట్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత హోమియో వైద్య శిబిరాన్ని స్థానిక కార్పొరేటర్, జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు శ్రీమతి మహాలక్ష్మి రామన్ గౌడ్ ఘనంగా ప్రారంభించారు. ముందుగా హోమియోపతి వైద్య పితామహుడు డాక్టర్ శామ్యూల్ హానిమన్ చిత్రపటానికి పూలమాలలు వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్ మాట్లాడుతూ... సుదీర్ఘకాలంగా సమాజానికి విశేష వైద్య సేవలు అందిస్తూ, ప్రస్తుతం శాశ్వత ప్రాతిపదికన ఉచిత హోమియో వైద్య శిబిరాన్ని నిర్వహించడానికి ముందుకు వచ్చిన హెచ్ మ్యాట్ ప్రతినిధులను అభినందించారు. అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ కె. గోపాలకృష్ణ, ప్రధాన కార్యదర్శి డాక్టర్ జి. దుర్గాప్రసాద్ రావుల కృషి ప్రశంసనీయమని పేర్కొన్నారు. ఈ ఉచిత వైద్య సేవల సమాచారాన్ని హిమాయత్‌నగర్ డివిజన్ ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడానికి తనవంతు సహకారం అందిస్తానని, స్థానికులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ కె. గోపాలకృష్ణ మాట్లాడుతూ... ఈ ఉచిత హోమియోపతి వైద్య శిబిరం ఇకపై ప్రతినెలా చివరి శనివారం ఉదయం 10:00 గంటల నుండి మధ్యాహ్నం 1:00 గంట వరకు నిర్వహించబడుతుందని తెలిపారు. నిపుణులైన వైద్యులచే ఉచిత కన్సల్టేషన్‌తో పాటు, రోగులకు ఒక వారానికి సరిపడా మందులను ఉచితంగా అందిస్తామని స్పష్టం చేశారు. ప్రారంభ శిబిరంలో సీనియర్ హోమియో వైద్యులు డాక్టర్ ఎన్.ఎస్. రఘురాం, డాక్టర్ భావనా గురునాని రోగులకు ఉచితంగా వైద్య సేవలందించారు. రానున్న రోజుల్లో ప్రతినెలా ఇద్దరు సీనియర్ హోమియో వైద్యులు రొటేషన్ పద్ధతిలో సేవలు అందిస్తారని ప్రధాన కార్యదర్శి డాక్టర్ జి. దుర్గాప్రసాద్ రావు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌మ్యాట్ గవర్నింగ్ కౌన్సిల్ సీనియర్ సభ్యురాలు డాక్టర్ కె. కల్పన, ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎ. మాణిక్ ప్రభు, ఓపీడీ కన్సల్టెంట్ డాక్టర్ శ్రీనిధి, హౌస్ ఫిజీషియన్ డాక్టర్ షేక్ షాహేదా, డిస్పెన్సరీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదు డ్రైవ్‌కు విశేష స్పందన

బర్కత్‌పురా హౌసింగ్ బోర్డ్ కాలనీలో ఘనంగా ఓటరు నమోదు కార్యక్రమం

అర్హులైన ప్రతి పట్టభద్రుడూ ఓటరుగా నమోదు చేసుకోవాలని పిలుపు

కాచిగూడ, నవంబర్ 01: రాబోయే శాసనమండలి (ఎమ్మెల్సీ) ఎన్నికల నేపథ్యంలో పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోంది. హైదరాబాద్ బర్కత్‌పురా లోని హౌసింగ్ బోర్డ్ కాలనీలో ఆదివారం నిర్వహించిన ఎమ్మెల్సీ గ్రాడ్యుయేట్ ఓటర్ నమోదు డ్రైవ్ అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో సాగింది. బీఆర్ఎస్ బర్కత్‌పురా డివిజన్ ఇంచార్జి డాక్టర్ బి. శిరీష ఓంప్రకాశ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు డాక్టర్ బద్దుల ఓంప్రకాశ్ యాదవ్ ల సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలోని అనేకమంది పట్టభద్రులు, యువతీయువకులు పెద్ద ఎత్తున తరలివచ్చి, తమ విద్యార్హత పత్రాలను అందించి ఓటర్లుగా పేర్లను నమోదు చేసుకున్నారు.

ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి పునాది:

కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన సెంట్రల్ పీస్ కమిటీ సికింద్రాబాద్ జోన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్. శరత్ శ్యామ్, కాలనీ అసోసియేషన్ ప్రెసిడెంట్ టి. శేష్ నారాయణ్ మాట్లాడుతూ... ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత శక్తివంతమైన సాధనమని స్పష్టం చేశారు. డిగ్రీ లేదా దానికి సమానమైన అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఓటరుగా నమోదు చేసుకోవాలని, చైతన్యవంతమైన సమాజ నిర్మాణంలో పట్టభద్రుల పాత్ర కీలకమని ఈ సందర్భంగా వారు ఉద్ఘాటించారు. అర్హత ఉన్న ఏ ఒక్క గ్రాడ్యుయేట్ కూడా ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోకుండా ఉండిపోకూడదని పిలుపునిచ్చారు. కార్యక్రమ నిర్వాహకులు డాక్టర్ శిరీష, డాక్టర్ ఓంప్రకాశ్ యాదవ్ మాట్లాడుతూ... స్థానిక పట్టభద్రులకు ఓటరు నమోదులో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేసి ఫారాలు నింపడం నుండి ఆన్‌లైన్ అప్‌లోడ్ వరకు అన్ని సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని. అంబర్ పేట నియోజకవర్గంలోని గ్రాడ్యుయేట్లు అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రముఖ నాయకులు ఆర్.ఎల్.వి. ప్రసాద్, డాక్టర్ విజయ్ మోహన్, డాక్టర్ బసవరాజ్, పిల్లి యాదయ్య, సి. శ్రీకాంత్, రాఘవేంద్ర కులకర్ణి, మొలుగు చంద్రశేఖర్ రెడ్డి, డి. రాజ్‌కుమార్, కుర్రి కిరణ్, కే. శ్రవణ్ తో పాటు పెద్ద సంఖ్యలో స్థానిక నివాసితులు, పట్టభద్రులు మరియు కాలనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

మున్నూరు కాపుల చరిత్రకు అక్షరరూపం

భావితరాలకు స్ఫూర్తిగా ప్రత్యేక సంచిక ఆవిష్కరించిన పటేల్స్ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కొండ దేవయ్య పటేల్



వేములవాడ మున్నూరు కాపు సత్రంలో ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న పటేల్స్ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కొండ దేవయ్య పటేల్, కొత్త లక్ష్మణ్ పటేల్ తదితరులు.

వేములవాడ (వాయిస్ టుడే): మున్నూరు కాపుల ఘనమైన చరిత్ర, సంస్కృతి, సామాజిక ప్రస్థానాన్ని ప్రపంచానికి పరిచయం చేయడంతో పాటు భావితరాలకు చారిత్రక సంపదగా అందించేందుకు తెలంగాణ మున్నూరు కాపు జర్నలిస్టు ఫోరం ప్రత్యేక సంచికను తీసుకురావడం అభినందనీయమని పటేల్స్ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కొండ దేవయ్య పటేల్ అన్నారు. ఆదివారం వేములవాడలోని మున్నూరు కాపు సత్రంలో ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు కొత్త లక్ష్మణ్ పటేల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు.

10 వేలకు పైగా ప్రతుల ప్రచురణ లక్ష్యం

ఈ సందర్భంగా కొత్త లక్ష్మణ్ పటేల్ మాట్లాడుతూ.. రాష్ట్రస్థాయిలో తొలిసారిగా రూపొందిస్తున్న ఈ ప్రత్యేక సంచికను 10 వేలకు పైగా ప్రతులతో ప్రచురించి, దేశవిదేశాల్లో ఉన్న మున్నూరు కాపులకు ఉచితంగా అందజేయనున్నట్లు తెలిపారు. సమాజంలోని ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, విద్యావేత్తలు, అధికారులు, వ్యాపారవేత్తలు, సామాజిక సేవకుల విజయగాథలతో పాటు మున్నూరు కాపుల చారిత్రక నేపథ్యానికి సంచికలో ప్రాధాన్యం కల్పిస్తున్నట్లు వివరించారు. తమ జీవిత విశేషాలు, సేవా కార్యక్రమాలను ప్రత్యేక సంచికలో ప్రచురించుకోవాలనుకునే వారు 73864 16560, 8341707171 నంబర్లలో సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టు ఫోరం ప్రతినిధులు ఏ. బూసి శ్రీనివాస్ పటేల్, రచమల్ల సుగుణకర్ పటేల్, గాండ్ల చంద్రశేఖర్ పటేల్, సుధాకర్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

పేదల గుడిసెలు కూల్చడమే ఇందిరమ్మ రాజ్యమా?

వైఎస్సార్ నగర్ గుడిసెవాసులకు పట్టాలు ఇచ్చి ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలి


పేదల నివాస హక్కులను కాపాడాలి

ప్రజాసంఘాల జేఏసీ చైర్మన్ మాదాసి సురేష్, సామాజికవేత్త కేడల ప్రసాద్, జనసేన నేత పద్మజాదేవి

కాజీపేట, నవంబర్ 1 (వాయిస్ టుడే):లి పేదల గుడిసెలు కూల్చివేయడమే ఇందిరమ్మ రాజ్యమా? సంపన్న కాలనీల్లో పేదలకు నివసించే హక్కు లేదా? అని ప్రజాసంఘాల జేఏసీ జిల్లా చైర్మన్ మాదాసి సురేష్, మహాత్మా జ్యోతిరావు పూలే సామాజిక న్యాయవేదిక రాష్ట్ర అధ్యక్షుడు కేడల ప్రసాద్ పటేల్, జనసేన పార్టీ పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ పద్మజాదేవి ప్రశ్నించారు. ఆదివారం ప్రజాసంఘాల ప్రతినిధులు కాజీపేటలోని వైఎస్సార్ నగర్‌ను సందర్శించి, గుడిసెవాసుల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్సార్ నగర్‌లో సుమారు 150 పేద కుటుంబాలు గత మూడు దశాబ్దాలుగా గుడిసెలు వేసుకుని నివసిస్తున్నాయని తెలిపారు. ఆయా కుటుంబాలకు ఇంటి నంబర్లతో పాటు ఆధార్, ఓటరు, రేషన్ కార్డులు కూడా ఉన్నాయని పేర్కొన్నారు. అయినప్పటికీ, ప్రభుత్వ స్థలం పేరుతో కొంతమంది అధికార పార్టీ నాయకులు పేదలు నివసిస్తున్న భూములను కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు.

పేదల నివాస హక్కులను కాపాడాలి..

ఏళ్ల తరబడి నివసిస్తున్న పేద కుటుంబాలను అక్కడి నుంచి తొలగించే ప్రయత్నాలు చేయడం సమంజసం కాదని వారు అన్నారు. రాజ్యాంగం కల్పించిన నివాస హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు. వైఎస్సార్ నగర్‌లో నివసిస్తున్న కుటుంబాలను తొలగించకుండా, అదే స్థలంలో వారికి పట్టాలు మంజూరు చేసి, ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. పేదలు నివసిస్తున్న భూముల విషయంలో వస్తున్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. గుడిసెవాసులకు న్యాయం జరిగే వరకు వారి పక్షాన నిలబడి పోరాడతామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు శనిగారపు లక్ష్మి, నీరటి పావని, జానపట్ల మంజుల, జానపద శిరీష, ఎండీ అష్టల్ బీ, ఎండీ నికత్, ఎండీ నజీమా, సంబారి రుక్మమ్మ, గుండ్రాతి భాగ్యలక్ష్మి, ఎండీ రఫీయా, రాపర్తి ధనలక్ష్మి, చిలగాని ధనలక్ష్మి, ఓర్సు శంకరమ్మ, పూల లావణ్య, నీరటి పుష్ప, రాజగోపాల రేణుక, శనిగరపు సతీష్, ఓర్సు కొమురయ్య, నీరటి ఏలియా, ఎండీ రజాక్ తదితరులు పాల్గొన్నారు.






పాలకుల ప్రజా వ్యతిరేక విధానాలపై సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలి

సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ డివిజన్ నాయకులు ఊడుగుల రాములు.
రైతు,కార్మిక సమస్యలపై పోరాటం చేపట్టాలి

పెద్దముప్పారంలో అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు ప్రారంభం

దంతాలపల్లి నవంబర్01(వాయిస్ టుడే):- భారత విప్లవోద్యమంలో వందలాది మంది అమరవీరులు తమ అమూల్యమైన ప్రాణాలను త్యాగం చేసి ప్రజా పోరాటాలకు స్ఫూర్తిగా నిలిచారని, వారి త్యాగాల ఆశయ సాధన కోసం ప్రజా ఉద్యమాలను మరింత ఉధృతం చేయాలని సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ తొర్రూరు డివిజన్ నాయకులు ఊడుగుల రాములు పిలుపునిచ్చారు.నవంబర్ 1 నుంచి 7వ తేదీ వరకు నిర్వహిస్తున్న అమరవీరుల సంస్మరణ సభల వారోత్సవాల్లో భాగంగా దంతాలపల్లి మండలం పెద్దముప్పారం గ్రామంలోని పార్టీ గద్దె వద్ద జెండాలను ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన సభలో ఊడుగుల రాములు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంలో పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, ఈ విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు సంఘటితమై సమరశీల పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు.రైతు, కార్మిక సమస్యలపై పాలకుల నిర్లక్ష్యం! వ్యవసాయ రంగం అనేక సమస్యలతో సతమతమవుతున్నా వాటి పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని అన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించేలా చట్టం చేయాలని దేశవ్యాప్తంగా రైతులు ఉద్యమిస్తున్నా పాలకులు స్పందించడం లేదని ఆరోపించారు.కనీస వేతనాల సాధన కోసం కార్మికులు చేస్తున్న పోరాటాలకు ప్రజలు మద్దతుగా ఉండాలనికోరారు.రాష్ట్రంలో కరువు పరిస్థితులు నెలకొన్నా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పట్టించుకోకపోవడం సరికాదని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు.ఈ కార్యక్రమానికి సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ గ్రామ కార్యదర్శి సెగ్గం పెద్ద యాకయ్య అధ్యక్షత వహించగా డివిజన్ నాయకులు సెగ్గం యాకయ్య, లింగయ్య, సాదు వెంకన్న, గండ్ర ప్రవీణ్, ఊడుగుల మధుకర్, నాగన్న, మధు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ రాంనర్సయ్యకు రాష్ట్రస్థాయి మల్టిపుల్ అవార్డు

తొర్రూరు, నవంబర్ 1 వాయిస్ టుడే : అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించి మన్నన పొందిన తొర్రూరు లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షుడు డాక్టర్ రామ నర్సయ్యకు ఎండి 320 రాష్ట్రస్థాయి మల్టిపుల్ బెస్ట్ ప్రెసిడెంట్ పురస్కారం దక్కింది. ఈ పురస్కారాన్ని తాజాగా హైదరాబాద్ లోని కొంపల్లి హోమ్స్ టవ్స్ కన్వెన్షన్ లో లయన్స్ క్లబ్ ప్రముఖులు డాక్టర్ బాబురావు,సునీల్ కుమార్, మల్టిపుల్ కౌన్సిల్ చైర్ పర్సన్ రాజేంద్రప్రసాద్ అందజేశారు. గతి ఏడాది తొర్రూరు లయన్స్ క్లబ్ అధ్యక్షులుగా డాక్టర్ రామ నర్సయ్య అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించి జిల్లాలోనే అత్యుత్తమ క్లబ్ గా పేరు ప్రతిష్టలు తెచ్చుకున్నారు. అందుకుగాను జిల్లా తరపున, రీజియన్ తరపున రాష్ట్ర స్థాయి బెస్ట్ ప్రెసిడెంట్ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ రామ నర్సయ్య మాట్లాడుతూ గత ఏడాది లయన్స్ క్లబ్ అధ్యక్షునిగా తన బాధ్యతను త్రికరణ శుద్ధితో నిర్వహించానని తెలిపారు. తాము చేసిన సేవలను గుర్తించి రాష్ట్రస్థాయి బెస్ట్ అవార్డు రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఇప్పుడు తీసుకున్న రాష్ట్రస్థాయి మల్టిపుల్ అవార్డు తనకు , క్లబ్ కి ఎంతో గుర్తింపుని ఇచ్చాయని తెలియజేశారు. సంవత్సరం మొత్తం అన్ని కార్యక్రమాలకి సహకరించిన జిల్లా గవర్నర్ డాక్టర్ చంద్రశేఖర్ ఆర్య,తొర్రూర్ లయన్ ప్రముఖులు డాక్టర్ రాజేందర్ రెడ్డి, తమ్మెర లక్ష్మీనరసింహారావు, లయన్స్ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్ సి దామర సరేన్, టి.వెంక రెడ్డి, చిదిరాల నవీన్, ముడుపు రవీందర్ రెడ్డి, వజన పల్లి శ్రీనివాస్, బోనగిరి శంకర్, గోపాల్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



వేములవాడ భీమేశ్వర స్వామివారి సేవలో 'కితకితలు' గీతా సింగ్

రాజన్న సిరిసిల్ల జిల్లా, నవంబర్ 01 (వాయిస్ టుడే): వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధా మైన శ్రీ భీమేశ్వర స్వామి వారిని ప్రముఖ సినీ నటి 'కితకితలు' గీతా సింగ్ దర్శించుకున్నారు.?ఈ సందర్భం గా ఆలయం లో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల అనంతరం ఆలయ మండపంలో అర్చకులు వేదా శీర్వచనం అందజేశారు. అనంతరం దేవస్థానం ఈవో రమాదేవి ని గీతా సింగ్ మర్యాదపూర్వకం గా కలిశారు.

పదవులు ముఖ్యం కాదు.. ప్రాణం ఉన్నంతవరకు కులం కోసం సేవకుడిగానే పనిచేస్తా..

మున్నూరు కాపు సమాజ సేవే నా లక్ష్యం

వ్యవస్థాపక అధ్యక్షుడు కొండ దేవయ్య పటేల్



వేములవాడ, నవంబర్ 1 (వాయిస్ టుడే): తెలంగాణ మున్నూరు కాపు సంఘం (పటేల్స్) రాష్ట్రస్థాయి నూతన కార్యవర్గాన్ని ప్రజాస్వామ్యబద్ధంగా, పారదర్శకంగా ఎన్నుకునే లక్ష్యంతో ఆదివారం వేములవాడలోని మున్నూరు కాపు సత్రం భవనంలో రాష్ట్ర ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కొండ దేవయ్య పటేల్ మాట్లాడుతూ.. పదవులు తనకు ముఖ్యం కాదని, ప్రాణం ఉన్నంతవరకు తన కులం కోసం ఒక సేవకుడిగా పనిచేస్తానని స్పష్టం చేశారు. సమాజ ఐక్యత, సంఘం బలోపేతమే తన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

9 మందితో రాష్ట్ర ఎన్నికల కమిటీ

రాష్ట్ర సంఘం నూతన కార్యవర్గ ఎన్నికల నిర్వహణ కోసం తొమ్మిది మంది సభ్యులతో రాష్ట్ర ఎన్నికల కమిటీ ఏర్పాటు చేయాలని సమావేశంలో నిర్ణయించారు. ప్రధాన ఎన్నికల అధికారి, కన్వీనర్, సహాయ ఎన్నికల అధికారులతో కమిటీని త్వరలో నియమించనున్నారు. ఎన్నికల నిర్వహణ బాధ్యతలను ఈ కమిటీకి అప్పగించనున్నారు.

రాష్ట్రవ్యాప్తంగా సభ్యత్వ నమోదు

రాష్ట్రంలోని 33 జిల్లాల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టాలని నిర్ణయించారు. జిల్లా స్థాయిలో వెబ్‌సైట్ ద్వారా సభ్యత్వ నమోదు ప్రక్రియ చేపట్టి, ప్రత్యక్ష ఎన్నికల నిర్వహణ జరుగుతుంది. రాష్ట్ర అధ్యక్షుడు, ప్రధాన రాష్ట్ర కార్యవర్గానికి ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించారు. 18 సంవత్సరాలు నిండిన అర్హులైన సభ్యులకు ఓటు హక్కు కల్పించే అంశంపై చర్చించారు. ఎన్నికల నోటిఫికేషన్, నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఉపసంహరణ తదితర ప్రక్రియలను ఎన్నికల కమిటీ పర్యవేక్షించనుంది.

33 జిల్లాల్లో ఎన్నికల సమన్వయం

రాష్ట్రంలోని 33 జిల్లాలకు ఎన్నికల సమన్వయ బాధ్యులను నియమించి, జిల్లా స్థాయిలో ఎన్నికల ప్రక్రియను సమన్వయం చేయాలని నిర్ణయించారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు, సభ్యత్వ నమోదు, నాయకుల భాగస్వామ్యంపై చర్చించారు.

ఎన్నికల నియమావళి రూపకల్పన

అభ్యర్థుల అర్హతలు, ఎన్నికల ప్రచార విధానం, పోలింగ్ నిర్వహణ, ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన, ఫిర్యాదులు, అభ్యంతరాల పరిష్కారానికి సంబంధించి సమగ్ర ఎన్నికల నియమావళిని రూపొందించాలని నిర్ణయించారు.

త్వరలో ఎన్నికల షెడ్యూల్

రాష్ట్ర ఎన్నికల కమిటీ నియామకం అనంతరం ఎన్నికల తేదీలు, పూర్తి షెడ్యూల్‌ను ప్రకటించాలని సమావేశంలో నిర్ణయించారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, సభ్యుల భాగస్వామ్యం, ప్రజాస్వామ్య పద్ధతులకు ప్రాధాన్యత ఇవ్వాలని నాయకులు అభిప్రాయపడ్డారు.

యాదాద్రిలో తదుపరి రాష్ట్రస్థాయి సమావేశం

తెలంగాణ మున్నూరు కాపు సంఘం (పటేల్స్) తదుపరి రాష్ట్రస్థాయి సమావేశాన్ని యాదాద్రిలో నిర్వహించాలని సమావేశంలో ఆమోదించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఎన్నికల కమిటీ పూర్తి స్థాయి ఏర్పాటు, కమిటీ సభ్యుల బాధ్యతలు, ఎన్నికల నిర్వహణ తేదీలు, సభ్యత్వ నమోదు, ఎన్నికల షెడ్యూల్ తదితర అంశాలపై సమగ్ర సమాచారం అందించాలని నిర్ణయించారు. ఎన్నికల ప్రక్రియను ప్రజాస్వామ్యబద్ధంగా ముందుకు తీసుకెళ్లేందుకు అవసరమైన కార్యాచరణను ఖరారు చేయనున్నారు.

మహిళలు, కుల సభ్యుల భాగస్వామ్యం

ఈ సమావేశానికి రాష్ట్ర, జిల్లా నాయకులు, సంఘం ప్రతినిధులు, 11 జిల్లాలకు చెందిన జిల్లా అధ్యక్షులు, కార్యదర్శులతో పాటు మున్నూరు కాపు పటేల్ సోదరులు, మహిళా సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. తమ విలువైన సూచనలు, సలహాలు అందించారు. సంఘం భవిష్యత్తు కార్యాచరణ, నూతన కార్యవర్గ ఎన్నికలు, సభ్యత్వ నమోదు తదితర అంశాలపై చర్చించి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. మహిళలు కూడా సంఘం కార్యక్రమాల్లో చురుకైన భాగస్వాములు కావాలని అభిప్రాయపడ్డారు.

ప్రజాస్వామ్య ఎన్నికలు -- పారదర్శక నాయకత్వం -- సంఘటిత సమాజం అనే లక్ష్యంతో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, సంఘం ఎన్నికల ప్రక్రియను విజయవంతం చేయాలని సమావేశంలో నాయకులు పిలుపునిచ్చారు.





వైఎస్సార్ నగర్ గుడిసెవాసులకు అండగా ఉంటాం

పేదల పొట్టకొట్టొద్దు.. వారి పక్షాన పోరాడుతాం

ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్

ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్ రెడ్డిలపై విమర్శలు

గుడిసెవాసులకు స్థలం, పక్కా ఇళ్లు కట్టించి ఇవ్వాలని డిమాండ్



కాజీపేట, నవంబర్ 1 (వాయిస్ టుడే):ఐ కాజీపేట వైఎస్సార్ నగర్ గుడిసెవాసులకు అండగా నిలిచి, వారి హక్కుల సాధన కోసం పోరాటం చేస్తామని ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ స్పష్టం చేశారు. దశాబ్దాలుగా అక్కడ నివసిస్తున్న పేదలకు న్యాయం చేయాలని, వారి జీవనోపాధికి ఇబ్బందులు కలిగించవద్దని కోరారు. వైఎస్సార్ నగర్ గుడిసెవాసుల సమస్యపై ఆదివారం ఆయన మాట్లాడారు. దాదాపు మూడు, నాలుగు దశాబ్దాలుగా వైఎస్సార్ నగర్‌లో పేదలు గుడిసెలు వేసుకుని నివసిస్తున్నారని వినయ్ భాస్కర్ తెలిపారు. ఆ ప్రాంతంలో దేవాలయాలు, రహదారులు, విద్యుత్ దీపాలు, నల్లా నీరు తదితర మౌలిక సదుపాయాలు ఉన్నాయని పేర్కొన్నారు. రైల్వే రిటైర్డ్ అధికారుల కోసం కూడా అక్కడ కార్యాలయం నిర్మించామని గుర్తుచేశారు.

సుమారు 30 ఏళ్ల క్రితం స్వర్గీయ ప్రణయ్ భాస్కర్, విజయ రామారావు, కడియం శ్రీహరి ఈ అర్బన్ సీలింగ్ భూమిలో బస్టాండ్ నిర్మించాలని ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. 2014 ఎన్నికల సమయంలో తాను, అప్పటి ఎంపీ అభ్యర్థి కడియం శ్రీహరి వైఎస్సార్ నగర్ గుడిసెవాసులకు అండగా ఉంటామని హామీ ఇచ్చినట్లు చెప్పారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్న కడియం శ్రీహరి ఈ సమస్యపై స్పందించాలని ప్రశ్నించారు.

కాంగ్రెస్ నాయకులపై విమర్శలు..

వైఎస్సార్ నగర్ గుడిసెవాసుల విషయంలో కాంగ్రెస్ నాయకులు ద్వంద్వ వైఖరి అవలంబిస్తున్నారని వినయ్ భాస్కర్ విమర్శించారు. పేదలకు అండగా ఉంటామని గతంలో హామీ ఇచ్చిన నాయకులు ఇప్పుడు మాట మార్చుతున్నారని ఆరోపించారు. కాజీపేటలోని వైఎస్సార్ నగర్ గుడిసెవాసుల సమస్యను పరిష్కరించకుండా తనపై వ్యక్తిగత విమర్శలు చేయడం సరికాదన్నారు.

కాంగ్రెస్ నాయకులు భూ దోపిడీకి పాల్పడుతున్నారు..

కాజీపేట చౌరస్తా సమీపంలోని కాంప్లెక్స్‌కు గతంలో అనుమతులు రాలేదని, నాయిని రాజేందర్ రెడ్డి ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత అనుమతులు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకులు భూ దోపిడీకి పాల్పడుతున్నారంటూ వినయ్ భాస్కర్ ఆరోపణలు చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం లాఠీలు, తూటాలకు ఎదురొడ్డి పోరాడిన చరిత్ర తమకుందని వినయ్ భాస్కర్ పేర్కొన్నారు. అధికారులెవరైనా చట్టానికి విరుద్ధంగా వ్యవహరిస్తే తగిన రీతిలో స్పందిస్తామని అన్నారు. పోలీసులు తనను అదుపులోకి తీసుకుంటామని బెదిరిస్తున్నట్లు తమ పార్టీ నాయకులు తనకు చెప్పారని తెలిపారు.

నేడు తహసీల్దార్ కార్యాలయానికి ర్యాలీ..

వైఎస్సార్ నగర్ నుంచి కాజీపేట తహసీల్దార్ కార్యాలయం వరకు సోమవారం ర్యాలీ నిర్వహించనున్నట్లు వినయ్ భాస్కర్ ప్రకటించారు. తమతో కలిసి వచ్చే ప్రజా సంఘాలను కలుపుకొని గుడిసెవాసుల పక్షాన పోరాటం చేస్తామని చెప్పారు. గుడిసెవాసులు ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని, వారి తరఫున తాను పోరాడుతానని భరోసా ఇచ్చారు. అనంతరం కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ నగర్ పేదల స్థలాల జోలికి వెళ్లవద్దని నాయిని రాజేందర్ రెడ్డిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ప్రజాప్రతినిధిగా ఎన్నికైన వారు పేదలకు అండగా నిలవాలి తప్ప, సంపన్నులకు అండగా ఉండకూడదన్నారు. పేదల సమస్యలపై పోరాడే నాయకులను కించపరిచే వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని సూచించారు.

కాజీపేట చౌరస్తాలోని కాంప్లెక్స్‌కు 15 ఏళ్లుగా రాని అనుమతులు ఎమ్మెల్యేగా నాయిని రాజేందర్ రెడ్డి ఎన్నికైన తర్వాత ఎలా వచ్చాయని ప్రశ్నించారు. వైఎస్సార్ నగర్ గుడిసెవాసులకు స్థలాలు కేటాయించి, పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. నాయిని రాజేందర్ రెడ్డి సంపాదన, భూముల వ్యవహారాలపై యాదవరెడ్డి విమర్శలు చేశారు. ఈ వ్యాఖ్యలు ఆయన చేసిన ఆరోపణలుగా పరిగణించాల్సి ఉంటుంది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ మాజీ సభ్యుడు నార్లగిరి రమేష్, మాజీ కార్పొరేటర్లు సంకు నర్సింగరావు, సోదా కిరణ్, తండమల్ల వేణు, డివిజన్ అధ్యక్షులు పాలడుగుల శివకుమార్, రంజిత్, ఆర్టీఏ మాజీ సభ్యుడు కాటాపూర్ రాజు, సీనియర్ నాయకులు సుంచు కృష్ణ, మర్యాల కృష్ణ, నయీంఉబేర్, అష్టల్, యాదగిరి, రఘు, ప్రభాకర్, ఎస్కే మహమూద్, రాబర్ట్, బాచి, బరిగెల వినయ్, శ్రీను, లీగల్ సెల్ బాధ్యులు నాయిని రవి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 'సీనియర్ సిటిజన్స్ అనుభవాల ఆత్మీయ సమ్మేళనం'



హుజూరాబాద్ నవంబర్ 1 (వాయిస్ టుడే): వయసు అనేది కేవలం ఒక సంఖ్య మాత్రమేనని, మనసును ఉల్లాసంగా, ఉత్సాహంగా ఉంచుకుంటే వందేళ్ల నిండు నూరేళ్ల జీవితాన్ని ఆనందంగా గడపవచ్చని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. హుజురాబాద్ పట్టణంలోని హుజురాబాద్ క్లబ్ లో ఆదివారం రాష్ట్రంలోనే ఎక్కడా లేని విధంగా ఓ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. స్థానిక 'మార్నింగ్ ఫ్రెండ్స్' ఆధ్వర్యంలో, పట్టణ కౌన్సిలర్, ప్రముఖ పర్యావరణవేత్త వర్ధినేని రవీందర్‌రావు సౌజన్యంతో నిర్వహించిన 'సీనియర్ సిటిజన్స్ అనుభవాల ఆత్మీయ సమ్మేళనం' అత్యంత స్ఫూర్తిదాయకంగా సాగింది. హుజురాబాద్ పట్టణంలో నివాసముంటున్న వారితో పాటు ఉద్యోగ, వ్యాపార రీత్యా ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన 70 ఏళ్ల పైబడిన సుమారు 150 మంది వృద్ధులను ఒకే వేదికపైకి చేర్చి ఈ సమ్మేళనాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీనియర్ సిటిజన్లను శాలువాలతో ఘనంగా సత్కరించి గౌరవించారు.

అనుభవాల పంపకం - ఆదర్శాల సందేశం...

ఈ కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ.. జీవిత చరమాంకంలో పిల్లలు, ఆస్తిపాస్తులు ఉన్నప్పటికీ ఒంటరిగా జీవించడం వృద్ధులకు నరకప్రాయంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. సీనియర్ సిటిజన్లు ఒంటరితనానికి గురికాకుండా తమ కుటుంబ సభ్యులతో, మనవళ్లు, మనవరాళ్లతో కలిసి ఆనందంగా గడిపినప్పుడే మానసిక ప్రశాంతత, సంపూర్ణ ఆరోగ్యం లభిస్తాయని స్పష్టం చేశారు. జీవితంలో సంపాదించిన దాంట్లో కొంత భాగాన్ని సమాజంలోని పేదలు, బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి వెచ్చించి చేయూతనివ్వాలని, సమాజ హితమే పరమావధిగా జీవించాలని కోరారు.

అండగా ఉంటాం -మార్నింగ్ ఫ్రెండ్స్

సీనియర్ సిటిజన్లకు ఎలాంటి కష్టాలు, సమస్యలు తలెత్తినా తాము అండగా ఉంటామని, అవసరమైన సమయాల్లో 'మార్నింగ్ ఫ్రెండ్స్' గ్రూపు సభ్యులను సంప్రదించవచ్చని నిర్వాహకులు భరోసా ఇచ్చారు. అనంతరం పలువురు వృద్ధులు మాట్లాడుతూ.. గతంలో తాము సమాజం కోసం చేసిన సేవలు, జీవితంలో ఎదుర్కొన్న ఒడిదుడుకులు, కఠిన పరిస్థితులను అధిగమించిన తీరును, అందుకు పాటించిన మెలకువలను సభికులతో పంచుకున్నారు. ఈ తరానికి మార్గదర్శకంగా నిలిచేలా ఈ కార్యక్రమం నిర్వహించడం పట్ల నిర్వాహకులకు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జేపీసీ నాయకులు పలకల ఈశ్వర్ రెడ్డి,వేల్పుల రత్నం, ఆవునూరు సమ్మయ్య,ముక్కెర రాజు, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, సర్పంచ్ కట్కూరి మల్లారెడ్డి,బెదరకోట జనార్ధన్, చిరంశెట్టి వీరయ్య, మార్త రవీందర్, బత్తుల సమ్మయ్య, మామిడిపల్లి సాయి పట్టణ ప్రముఖులు, మార్నింగ్ ఫ్రెండ్స్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఆల్ ఇండియా రైతు సంఘం మహాసభలు విజయవంతం చేయండి: వైవి



సూర్యాపేట, నవంబర్ 1 (వాయిస్ టుడే ప్రతినిధి) : నవంబర్ 15 ,16 ,17 ,18 తేదీలలో నల్లగొండ జిల్లా కేంద్రంలో జరుగు ఆల్ ఇండియా రైతు సంఘం 36వ మహాసభలు విజయవంతం చేయాలని ,రైతు సంఘం సీనియర్ నాయకులు ఏనుగుల వీరాంజనేయులు కోరారు ఆదివారం మండలంలోని శ్రీరంగాపురం, చాకిరాల, రామాపురం, ఈకే పేట, తెల్లబెల్లి, గ్రామా ల్లో ప్రచారం నిర్వహించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఈ మహాసభలకు దేశవ్యాప్తంగా ప్రతినిధులు హాజరవుతున్నారని రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలు , రైతు చట్టాలపై, కెమెరా రాష్ట్ర ప్రభుత్వ విధానాలు,చర్చించి భవిష్యత్తు కర్తవ్యాలు రూపొందించుకోనున్నారని, 15వ తారీఖున లక్ష మందితో భారీ ఊరేగింపు జరుగుతుందని, ఈ మహాసభల విజయవంతం చేసేందుకు గ్రామ గ్రామాన సమావేశాలు నిర్వహిస్తున్నట్లు వీరాంజనేయులు తెలిపారు.



కృష్ణ ప్రసాద్ సేవలు అభినందనీయం: సీఐ వడ్డేపల్లి మురళి

న్యూ లక్ష్మీపురం అగ్రో రిసార్ట్‌లో ఘనంగా పదవి వీడ్కోలు

పోలీసు అధికారులు, సిబ్బంది మధ్య ఆత్మీయ సన్మానం

ముదిగొండ మండలం నవంబర్ 1 వాయిస్ టుడే : ముదిగొండ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహించిన ఎస్సై కృష్ణ ప్రసాద్‌కు న్యూ లక్ష్మీపురం అగ్రో రిసార్ట్‌లో ఘనంగా పదవి వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్‌హెచ్‌ఓ, సీఐ వడ్డేపల్లి మురళి హాజరై మాట్లాడారు.ఈ సందర్భంగా సీఐ వడ్డేపల్లి మురళి మాట్లాడుతూ, ఎస్సై కృష్ణ ప్రసాద్ ముదిగొండ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహించిన కాలంలో బాధ్యతాయుతంగా, నిబద్ధతతో సేవలందించారని కొనియాడారు.విధి నిర్వహణలో క్రమశిక్షణ పాటిస్తూ, సహచరులతో సత్సంబంధాలు కొనసాగిస్తూ, ప్రజలతో స్నేహపూర్వకంగా వ్యవహరించడం ప్రతి పోలీసు అధికారి అనుసరించాల్సిన అంశాలని పేర్కొన్నారు.పోలీసు శాఖలో ప్రతి అధికారి తనకు కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ ప్రజల విశ్వాసాన్ని పొందారు అని సీఐ సూచించారు. ఎస్సై కృష్ణ ప్రసాద్ భవిష్యత్‌లో మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షిస్తూ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

వెంకటనరసింహాపురం ప్రజల్లో TDP అభ్యర్థి అన్నే అంజిబాబు గెలుపు ఖాయమని ధీమా

గన్నవరం మండలం, కేశరపల్లి: కేశరపల్లి 3వ సెగ్మెంట్ టిడిపి అభ్యర్థి లిఅన్నే అంజిబాబుని గెలుపు ఖాయమని వెంకటనరసింహాపురం గ్రామ ప్రజలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో జరిగిన పలు ప్రచార కార్యక్రమాల్లో, ఇంటింటి పర్యటనలో ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి అంజిబాబుకు మద్దతు ప్రకటిస్తున్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి తాము సైకిల్ గుర్తుకే ఓటు వేస్తామని గ్రామస్తులు చెబుతున్నారు. వెంకటనరసింహాపురం గ్రామ పెద్దలు మాట్లాడుతూ, "అన్నే అంజిబాబు ఎప్పుడూ మన కష్టసుఖాల్లో ఉంటారు. ఆయన గెలిస్తేనే మన గ్రామ అభివృద్ధి జరుగుతుంది. 3వ సెగ్మెంట్‌లో ఆయన గెలుపు ఎవరూ ఆపలేరు" అని అన్నారు. మహిళలు, యువకులు, రైతులు కూడా పెద్ద సంఖ్యలో ప్రచారంలో పాల్గొంటూ, "అన్నే అంజిబాబు గెలుపు ఖాయం" అంటూ నినాదాలు చేస్తున్నారు. ఎఐఎ, జనసేన, దీప్తి కార్యకర్తలు ఈ ధీమాను మరింత బలోపేతం చేస్తూ, ఓటర్లను చైతన్యపరుస్తున్నారు.

సూర్యాపేట ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ కాంట్రాక్టర్‌ని తొలగించాలి

PDSU, POW ఆధ్వర్యంలో హాస్పిటల్ ముందు ధర్నా

సూర్యాపేట జిల్లా (వాయిస్ టుడే) ప్రతినిధి నవంబర్ 2 :సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌లో అపరిశుభ్రత, దుర్వాసనతో రోగులు, వారి సహాయకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పిఓడబ్ల్యు జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి రేణుక, పిడిఎస్యు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎర్ర అఖిల్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రోజు ప్రజాసంఘాల ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌లోని వివిధ విభాగాలను పరిశీలించిన అనంతరం ఆసుపత్రి ముందు ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా పిఓడబ్ల్యు జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి రేణుక, పిడిఎస్యు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎర్ర అఖిల్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రికి ప్రతిరోజూ వందలాది మంది పేద, మధ్యతరగతి ప్రజలు వైద్యం కోసం వస్తున్నారని, కానీ ఆసుపత్రిలో అన్ని రకాల మందులు లేకపోవడం,కనీస పారిశుద్ధ్య ప్రమాణాలు పాటించకపోవడం వల్ల రోగులు మరింత ఇబ్బందులకు గురవుతున్నారని విమర్శించారు.ఆసుపత్రి పరిసరాల్లో డ్రైనేజ్ వ్యవస్థ సక్రమంగా లేకపోవడం, మురుగునీటి సమస్యలు, వార్డుల్లో అపరిశుభ్రత, దుర్వాసన వెదజల్లడం వంటి సమస్యలతో రోగులు తీవ్ర అవస్థలు పడుతున్నారని తెలిపారు. పారిశుద్ధ్య నిర్వహణపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం కోట్లాది రూపాయలు వైద్యరంగానికి ఖర్చు చేస్తున్నామని గొప్పలు చెప్తున్న పాలకులు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో కనీస సౌకర్యాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతుంటే ఈ పాలకులు ఎం చేస్తున్నారని ప్రశ్నించారు . రక్త పరీక్షల రిపోర్టు రెండు,మూడు రోజులకు రావడం వల్ల రోగం ఏందో అర్థంకాక ట్రీట్మెంట్ జరగడం లేదన్నారు. అన్ని రకాల మందులు అందుబాటులో లేకపోవడం వల్ల, బయట మెడికల్ షాప్ లో కొనలేక పేద ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పరీక్షలకు సంబంధించిన అన్ని పరికరాలు లేక బయట చేయించుకోవాల్సిన పరిస్థితి ఉందన్నారు. రాత్రి వేళల్లో డాక్టర్స్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. చికిత్స తర్వాత రోగుల దగ్గర నుండి బలవంతంగా డబ్బులు వసూలు చేసే వారిని ఉద్యగం నుండి తీసివేయాలన్నారు.

సిద్దేశ్వరాలయంలో ఉజ్జయిని జగద్గురు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు

రథోత్సవం, రుద్రాభిషేకం..

భక్తులకు జగద్గురు ఆశీర్వచనాలు

జహీరాబాద్ వాయిస్ టుడే నవంబర్ 01 జహీరాబాద్: సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని సిద్దేశ్వరాలయంలో జంగమ సమాజం ఆధ్వర్యంలో నిర్వహించిన లక్ష బిల్వార్చన, అయ్యాచార దీక్షల మహోత్సవాలు ఆదివారం వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

రాచన్న స్వామి ఆలయం నుంచి రథోత్సవం

మహోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం ఉజ్జయిని జగద్గురు రథోత్సవ ఊరేగింపు రాచన్న స్వామి ఆలయం నుంచి సిద్దేశ్వరాలయం వరకు కొనసాగింది. భక్తుల ఆధ్యాత్మిక ఉత్సాహం మధ్య రథోత్సవం నిర్వహించారు. అనంతరం సిద్దేశ్వరాలయంలో ఉజ్జయిని జగద్గురు ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు.

వేదమంత్రోచ్ఛరణల మధ్య పూజలు

ఆలయంలో స్వామివారికి రుద్రాభిషేకం, పాదపూజ కార్యక్రమాలను వేదమంత్రోచ్ఛరణల మధ్య సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. శివనామస్మరణతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. జంగమ సమాజ ప్రతినిధులు, భక్తులు పూజల్లో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులయ్యారు.



భక్తులకు జగద్గురు ప్రవచనాలు

ఈ సందర్భంగా ఉజ్జయిని పీఠాధిపతి భక్తులను ఉద్దేశించి ఆధ్యాత్మిక ప్రవచనాలతో పాటు ఆశీర్వాచనం అందించారు. ధార్మిక కార్యక్రమాల ప్రాముఖ్యతను వివరిస్తూ భక్తులకు ఆధ్యాత్మిక సందేశాన్ని అందించారు. అయ్యాచార దీక్షలు స్వీకరించిన వారికి ఆశీర్వచనాలు అందజేశారు. వివిధ మఠాలకు చెందిన పీఠాధిపతులు సోమలింగ శివాచార్య, వీరేశ్వర శివాచార్య, శివయోగి శివాచార్య, వైరాగ్య శిఖామణి అవధూత గిరి మహారాజ్, రాచయ్య స్వామి, సిద్ధయ్య స్వామి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

మహోత్సవాల ముగింపు సందర్భంగా ఆలయ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదాలు అందజేశారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేపట్టారు.జంగమ సమాజ ప్రతినిధులు,తాలూకా అధ్యక్షులు మల్చల్మా శ్రీనివాస్ స్వామి, పట్టణ అధ్యక్షులు మఠం శివ కుమార్, చంద్ర శేఖర్, బస్వరాజ్, శరణయ్య, ఉమాపతి, సంగమేశ్వర్ స్వామి, రాజకుమార్, రాజు(బిఎస్ఎన్ఎల్), బస్వరాజ్, చెన్నయ్య స్వామి, మల్లికార్జున్ స్వామి, శివకుమార్, శశిధర్ స్వామి, నరేష్ స్వామి, మహారుద్రయ్య స్వామి అయ్యాచార దీక్షలు స్వీకరించిన భక్తులు, వివిధ ప్రాంతాలు కర్ణాటక లోని హుమ్నాబాద్, బీదర్, కల్బుర్గి,చించొళి తో పాటు హైదరాబాద్, సంగారెడ్డి, సదాశివపేట, వికారాబాద్, తాండూర్,నారాయణ ఖేడ్, అందోల్ -జోగిపేట నుంచి వచ్చిన శివభక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేశారు.



ఓటు చోరీని అరికట్టాలి.. బీజేపీని గద్దె దించాలి

కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన.. ప్రధాని మోదీ దిష్టిబొమ్మ దహనం

ప్రధాన ఎన్నికల అధికారి జ్ఞానేశ్ కుమార్‌ను సస్పెండ్ చేయాలి

కాంగ్రెస్ ఎస్ఐఆర్ కోఆర్డినేటర్ ప్రవీణ్ టోనీ

రాజన్న సిరిసిల్ల జిల్లా, నవంబర్ 01(వాయిస్ టుడే): ఓటు హక్కును పరిరక్షించుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని కాంగ్రెస్ ఎస్ఐఆర్ కో ఆర్డినేటర్ ప్రవీణ్ టోనీ అన్నారు. ఓటు చోరీకి నిరసనగా, బీజేపీ ప్రభుత్వ వైఖరిని ఖండిస్తూ తంగళ్లపల్లి మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మునిగాల రాజు ఆధ్వర్యం లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు.ఈ సందర్భం గా ప్రవీణ్ టోనీ మాట్లాడుతూ,ప్రజాస్వామ్య బద్ధంగా ఓటు హక్కు పొందిన బీసీ, ఎస్సీ, మైనారిటీ వర్గాలకు చెందిన కాంగ్రెస్ మద్దతుదారుల ఓట్లను తొలగించి తిరిగి అధికారం లోకి రావాలని బీజేపీ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఇలాంటి చర్యలను ప్రజలు తిప్పి కొట్టాలని, బీజేపీని గద్దె దించాలని పిలుపు నిచ్చారు. ఢిల్లీలోని రాంలీలా మైదానంలో రాహుల్ గాంధీ ఆధ్వర్యం లో నిర్వహిస్తున్న ఓటు చోరీ నిరసన కార్యక్రమా నికి మద్దతుగా ఈ ఆందోళన చేపట్టినట్లు తెలిపారు. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును కాపాడు కోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఓటు చోరీకి పాల్పడ్డారంటూ ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రధాన ఎన్నికల అధికారి జ్ఞానేశ్ కుమార్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో ఎస్ఐఆర్ కో ఆర్డినేటర్ ప్రవీణ్ టోనీ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మునిగాల రాజు, నాయకులు నర్సింగం, భూపతి, ఆనందం, పొన్నాల పరుశురాం, రాజేశ్వర రావు, సుద్దాల శ్రీనివాస్, సందీప్, హారిక రెడ్డి, పోతరాజు కళ, నాగరాజు, గణేష్, పెద్దూరి తిరుపతి, పయ్యావుల శ్రీనివాస్, రాజిరెడ్డి, పరుశురాం, బాబు, మల్లేశం, కరుణాకర్, సుద్దాల శ్రీను, లక్ష్మణ్, ఎడ్ల తిరుపతి, శ్రీశైలం, బండి యుగేందర్, వెంకట్ రెడ్డి, చిలుక తదితరులు పాల్గొన్నారు.



ఓటు హక్కును కాపాడాలి

- సీఈసీ జ్ఞానేష్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలి

జమ్మికుంట నవంబర్ 1 (వాయిస్ టుడే): ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రతి పౌరుడి ఓటు హక్కును కాపాడాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందని యూత్ కాంగ్రెస్(శిబ్ష జశీఅస్త్రతీవం) జమ్మికుంట మండల అధ్యక్షుడు బుడిగె శ్రీకాంత్ అన్నారు. రాహుల్ గాంధీ నేతృత్వంలో ఢిల్లీలోని రాంలీలా మైదానంలో నిర్వహించిన మహా మార్చ్‌కు మద్దతుగా ఆదివారం జమ్మికుంట గాంధీ చౌరస్తాలో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో శాంతియుత నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఓటర్ల జాబితా సవరణ పేరుతో అర్హులైన పౌరుల ఓటు హక్కుకు భంగం కలిగించకూడదన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో పూర్తి పారదర్శకత పాటించాలని, తొలగించిన ఓట్ల వివరాలను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సంఘం స్వతంత్రతను కాపాడాలని, ప్రజల్లో నమ్మకం కల్పించడంలో విఫలమైన సీఈసీ జ్ఞానేష్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని కోరారు. ఓటు హక్కు పరిరక్షణ, రాజ్యాంగ రక్షణ కోసం కాంగ్రెస్ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు వీరమనేని పరుశురాం, సుంకరి రమేష్, పర్లపెల్లి నాగరాజు, కౌన్సిలర్ శ్రీపతి నరేష్, ఒగ్గు రమేష్, చందా రాజు, అన్నం ప్రవీణ్, వాసాల రామస్వామి, మహేష్, పంజాల అజయ్, గొడుగు మానస, పాతకాల రమేష్, దేవునూరి వినయ్, రాచపల్లి సాగర్, బిజిగిరి శ్రీకాంత్, తోట స్వప్న, పిడుగు భాగ్య, బండి పవన్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లాకు మంచి పేరు తీసుకురావాలి

-మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది

సూర్యాపేటలో జిల్లా సబ్ జూనియర్ బాలుర కబడ్డీ సెలక్షన్స్



సూర్యాపేట: నవంబర్1(వాయిస్ టుడే ప్రతినిధి) గ్రామీణ ప్రాంతాల్లో కబడ్డీ క్రీడకు ఎనలేని ఆదరణ ఉందని మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది అన్నారు.ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో సూర్యాపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా సబ్ జూనియర్ బాలుర కబడ్డీ సెలక్షన్స్ ను నిర్వహించారు. ఈ ఎంపికలను కౌన్సిలర్ కొణతం రాజేష్ రెడ్డితో కలిసి ఆమె ప్రారంభించి మాట్లాడారు.ఎంపికైన క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభను కనబరిచి సూర్యాపేట జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని అన్నారు.ఎంపికైన క్రీడాకారులు నవంబర్ 12 నుంచి 14 వరకు వికారాబాద్ లో జరిగే తెలంగాణ రాష్ట్ర సబ్ జూనియర్ కబడ్డీ టోర్నమెంటులో పాల్గొంటారని తెలిపారు.విద్యార్థులు క్రీడలతో పాటు విద్యలో రాణించాలని అన్నారు.క్రీడలతో శారీరక దృఢత్వంతో పాటు స్నేహభావం పెంపొందుతుందని అన్నారు.రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొనే జిల్లా టీం కొరకు 25 మంది క్రీడాకారులను ప్రత్యేక క్యాంపుకు ఎంపిక చేశారు.ఈ కార్యక్రమంలో సూర్యాపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అల్లం ప్రభాకర్ రెడ్డి, నామా నరసింహారావు, చైర్మన్ సోమిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, అసోసియేషన్ సభ్యులు ఎస్ కె.ఇమామ్,రవీందర్ రెడ్డి, రమేష్ బాబు, ఇంద్రారెడ్డి, కోటి,లక్ష్మినారాయణ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

